ప్రజాశక్తి
సోమవారం 14 ఆగస్టు 2023
8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

రైతుకు సాగునీటి కష్టం

◆ వర్షాధారంపై వ్యవసాయం ◆ ఏటా తప్పని వర్షాభావం
◆ ముందుకు కదలని పోలవరం ఎడమ కాలువ, సుజల స్రవంతి పనులు ◆ శ్రద్ధ చూపని ప్రభుత్వాలు



తాండవ జలాశయం (ఫైల్ ఫొటో)

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

జిల్లాలో సాగునీటి వనరుల పనులు ఎక్కడివక్కడే వున్నాయి. రైతుకు సాగునీటి వసతి కల్పించాలన్న శ్రద్ధ ప్రభుత్వాలకు లోపించడంతో అత్యధిక భాగం వర్షాధారంపై సాగుచేయాల్సిన పరిస్థితి రైతుకు ఏర్పడింది. వర్షాలు సకాలంలో కురవక ఈ ఏడాది ఖరీఫ్ వలే ప్రతియేటా సకాలంలో పంటవేయలేక అవస్థలు పడుతున్నారు. సాగునీటి ప్రాజెక్టులు పూర్తిచేసే చిత్తశుద్ధిలేమితో ప్రతిపాదిత ప్రాజెక్టుల పనులు ఏళ్ల తరబడి ముందుకు కదలడంలేదు. పోలవరం ఎడమ కాలువ, ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పనులు పూర్తయితే జిల్లాలో వ్యవసాయానికి సాగునీటి కొరత తీరేది. వర్షాలపై సాగుచేయాల్సిన పరిస్థితి వుండేదికాదు. పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల సమస్యను పరిష్కరించి, ప్రాజెక్టు, ఎడమ కాలువ పనులు పూర్తిచేస్తే అనకాపల్లి జిల్లాలో 10 మండలాల్లోని 1.62 లక్షల ఎకరాలకు సాగునీటి వసతి కలగనుంది. ఎడమ కాలువతో ముడిపడివున్న ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పనులను కూడా పూర్తిచేయగలిగితే 14 మండలాల్లోని మరో 2.73 లక్షల ఎకరాలకు సాగునీరు లభించనుంది. పోలవరం ఎడమ కాలువ, ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పూర్తయితే కొత్తగా 4.35 లక్షల ఎకరాలకు సాగు నీటి సౌకర్యం కలిగేది. ఎంతో ప్రయోజనకరమైన ఈ రెండు ప్రాజెక్టులను పూర్తిచేయక పోవడంతో జిల్లా రైతాంగం కరువు కాటకాలను ఎదుర్కోవాల్సివస్తోంది. జిల్లాలో ప్రస్తుతం భారీ నీటిపారుదల ప్రాజెక్టు తాండవ కింద 32,689 ఎకరాల ఆయకట్టు సాగవుతోంది. మధ్య తరహా నీటిపారుదల ప్రాజెక్టులు రైవాడ, కోణాం, పెద్దేరు జలాశయాల కింద 42,725 ఎకరాల ఆయకట్టు వుంది. భారీ, మధ్య తరహా ప్రాజెక్టుల మిగతా 2లో..



మహాసభలో మాట్లాడుతున్న ఎన్ఎన్.రాజు

శాస్త్రీయ విద్యా విధానం అవసరం

ప్రముఖ మానసిక వైద్య నిపుణులు ఎన్ఎన్.రాజు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ప్రభుత్వాలు శాస్త్రీయ విజ్ఞానాన్ని పెంపొందించే విద్యా విధానాన్ని రూపొందించాలని ప్రముఖ మానసిక వైద్య నిపుణులు, జనవిజ్ఞాన వేదిక జిల్లా గౌరవాధ్యక్షులు డాక్టర్ ఎన్ఎన్.రాజు అన్నారు. జన విజ్ఞాన వేదిక విశాఖ జిల్లా మహాసభలు ఆదివారం అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో జరిగాయి. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ సమాజంలో గతంలోకంటే మూఢ నమ్మకాలు బాగా పెరిగాయన్నారు. సమాజ గమనం వెనక్కు వెళ్ళే పరిస్థితి దాపురించిందని తెలిపారు. అలాగే అన్ని వయస్సుల వారిలో ఆత్మహత్యల సంఖ్య పెరగడం ఆందోళన కలిగిస్తోందని అన్నారు. అందుకే ప్రభుత్వాలు శాస్త్రీయ విజ్ఞానం వైపు ప్రజలను నడిపించాలన్నారు. విద్య, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. సిహెచ్.శుభకర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఫిషరీస్ డిపార్టుమెంట్ సైంటిస్ డాక్టర్ విజయన్ మాట్లాడుతూ ప్రజలలో ప్రశ్నించేతత్వం తగ్గిపోతోందన్నారు. ఛాందస భావాలు విపరీతంగా పెరగడం చాలా ఆందోళనకరమన్నారు. ప్రశ్నించే తత్వాన్ని విద్యార్థి దశలోనే అలవరచుకోవాలని అన్నారు. మూఢ నమ్మకాలకు వ్యతిరేకంగా అవగాహనా సదస్సులు నిర్వహించాలన్నారు. జన విజ్ఞాన వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.మురళీధర్ మాట్లాడుతూ ప్రభుత్వాలు ఆర్టికల్ 51 (హెచ్)ను పూర్తిగా మిగతా 2లో..

అవయవదానంపై పెరిగిన అవగాహన

▶ వార్త 2లో..

సాగరతీరంలో ఉత్సాహంగా ఎపిఎల్ 3కె రన్

▶ వార్త మెయిన్‌లో..

పవన్‌కు టిడిపి నేతల కబ్జాలు కనబడవా ? : అమర్

▶ వార్త మెయిన్‌లో..



గాజువాక రోడ్డులో వారాహి వాహనం నుంచి అభివాదం చేస్తూ ముందుకు సాగుతున్న పవన్

ఉక్కు ప్రైవేటీకరణపై జగన్ స్పందించాలి

జనసేన అధినేత పవన్ కల్యాణ్

వార్త మెయిన్‌లో..

దేశీయ విమానాల జోష్

◆ ఎయిర్ కార్గో అవకాశాలన్నిటినీ వినియోగిస్తున్నాం
◆ అధునాతన మౌలిక వసతులు కల్పించాం
◆ రోజుకు ఇండిగో, ఎయిర్ ఇండియా సర్వీసుల ద్వారా 12 టన్నుల కార్గో
◆ 'ప్రజాశక్తి'తో విశాఖ ఎయిర్ పోర్టు డైరక్టర్ ఎస్.రాజారెడ్డి



ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

ఎయిర్ పోర్టు నూతన డైరక్టరుగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన ఎస్.రాజారెడ్డి పేర్కొన్నారు. విశాఖ విమానాశ్రయంలో గతంలో పనిచేసిన అనుభవం ఇప్పుడు దోహదపడుతుందని ఢిల్లీ నుంచి ఇటీవల బదిలీపై వచ్చిన ఆయన తెలిపారు. ఇంకా పలు విషయాలను 'ప్రజాశక్తి'తో పంచుకున్నారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

'విశాఖ ఎయిర్ పోర్టు.. ఎపిలో అతి పెద్దది. ఇటీవల బాగా విస్తరించబడింది. ఇక్కడ నుంచి దేశీయ విమానాలు మంచి జోష్‌లో ఉన్నాయి. విదేశీ విమానాల సంఖ్య పెంచేందుకూ కృషి చేస్తున్నాం. విదేశీ విమానాల కొరత కొంత ఉంది. గతంతో పోల్చితే విశాఖ ఎయిర్ పోర్టు నుంచి అంతర్జాతీయ విమాన గమ్యస్థానాలకు ఎయిర్‌క్రాఫ్ట్స రాకపోకలు పెంచే దిశగా ఎయిర్‌లైన్స్ ఆపరేటర్లతో సంప్రదింపులు నిరంతరం చేస్తున్నాం. అలాగే అధునాతన సౌకర్యాలను ఎయిర్ పోర్టులో పెంచుతున్నాం. రోజుకు విశాఖ విమానాశ్రయం నుంచి ఇండిగో, ఎయిర్ ఇండియా ఎయిర్‌క్రాఫ్ట్‌లో 12 టన్నుల సరుకు వెళ్తోంది. భవిష్యత్‌లో కార్గో ఇంకా పెరిగే



అవకాశాలున్నాయి. విశాఖ విమానాశ్రయ అభివృద్ధికి నా శాయశక్తులా కృషి చేస్తా' అని

గతం కంటే సౌకర్యాలు మెరుగుపడ్డాయా ?

గతం కంటే సౌకర్యాలు ఇక్కడ మెరుగుపడ్డాయి. అందుకు మిగతా 2లో..

అవయవదానంపై పెరిగిన అవగాహన

మొదటి పేజీ తరువాయి..

రైతుకు సాగునీటి కష్టం

కింద 75,414 ఎకరాలు సాగవుతోంది. ఏడమ కాలువ, సుజల స్రవంతి పూర్తయితే ప్రస్తుత ప్రాజెక్టుల ఆయకట్టు స్థిరీకరణ జరగనుంది. కానీ ప్రభుత్వాలు నీటిపారుదల ప్రాజెక్టుల నిర్మాణానికి నిధులు సరిపడా కేటాయించి, పూర్తిచేయకపోవడంతో రైతులు సాగుకు అవస్థలు పడుతున్నారు.

పోలవరం ఎడమ కాలువ పూర్తయితే..

నక్కపల్లి మండలంలో 31,075, ఎస్.రాయవరంలో 25,890, యలమంచిలిలో 15,261, కశింకోటలో 10,973, అనకాపల్లిలో 3,747, మునగపాకలో 8639, పాయకరావుపేటలో 19,610, రాంబిల్లిలో 20,441, పరవాడలో 2,719, అచ్యుతాపురంలో 23,884 ఎకరాలకు సాగునీరు లభించనుంది.

సుజల స్రవంతి పూర్తయితే..

చోడవరం మండలంలో 17,790, బుచ్చెయ్యపేటలో 28,010, రావికమతంలో 21,992, మాడుగులలో 28,998, చీడికాడలో 13,632, మాకవరపాలెంలో 21,617, కోటవురట్లలో 8,280, రోలుగుంటలో 32,188, నర్సీపట్నంలో 40,100, కశింకోటలో 6,998, అనకాపల్లిలో 7,050, సబ్బవరంలో 12,769, దేవరపల్లిలో 14,251, కోటపాడులో 19,661 ఎకరాలకు సాగునీటి వసతి కలగనుంది.

దేశీయ విమానాల జోష్

అనుగుణంగా ఎయిర్ ట్రాఫిక్ పెంచాల్సిన అవసరం ఉంది. 1995లో నేను ఎయిర్ పోర్టు డిపార్టుమెంట్‌లో ఉద్యోగ బాధ్యతల్లోకి వచ్చాను. పలు ర్యాంకుల్లో మహారాష్ట్రలోని గోండియా, చెన్నయ్, ఢిల్లీ విమానాశ్రయాల్లో పనిచేసిన అనుభవం ఉంది. 2009 - 2015 వరకూ ఆపరేషన్స్ విభాగంలో విశాఖలో పనిచేశాను. హుదూద్ తుపాను సమయంలో ఇక్కడే ఉన్నాను. ఎయిర్ పోర్టు సహాయక చర్యల్లో భాగస్వామ్యం అయి హుటాహుటిన పరిస్థితుల మెరుగుకోసం పనిచేశాం. విశాఖపట్నం కార్గో రవాణాకు అత్యంత అనుకూలమైన ప్రదేశం. ఎయిర్ పోర్టు దాన్ని అందిపుచ్చుకునేలా నా వంతు కృషి చేస్తాను.

భవిష్యత్తులో ఎయిర్ పోర్టు ఎలా ఉండబోతుంది ?

ఎయిర్ పోర్టు పెరిగింది. విస్తీర్ణం, పార్కింగ్ స్థలాలు విస్తరించడం జరిగింది. విమానాల సంఖ్య పెంచే దిశగా ఎయిర్‌లైన్స్ వాళ్లతో సంప్రదింపులు చేస్తున్నాం. ముఖ్యంగా అంతర్జాతీయ గమ్యస్థానాలకు సంబంధించిన విమానాలను పెంచేందుకు కృషిచేస్తున్నాం. కేవలం సింగపూర్‌కు మాత్రమే వారంలో ఐదు రోజుల రాకపోకలు ప్రస్తుతం జరుగుతున్నాయి. గతంలో కొలంబో, బ్యాంకాక్, దుబాయ్‌కి ఉండేవి. మొత్తంగా విమానాశ్రయం నుంచి కోవిడ్‌కు ముందు 40 విమానాలు నడుస్తుండేవి. నేడు 30 మాత్రమే నడుస్తున్నాయి.

ఎయిర్ ట్రాఫిక్ ఎలా ఉంది?

2022-2023లో 2.5 మిలియన్ల మంది ప్రయాణాలు సాగించారు. ఈ సంవత్సరం 2.88 మిలియన్లకు పెరగనుంది. కోవిడ్‌కు ముందు 2.88 మిలియన్ల మంది రాకపోకలు సాగించారు. ఇండిగో, ఎయిర్ ఆసియా, ఇండియా 1, ఎయిర్ ఇండియా సంస్థలు విమాన సర్వీసులను విశాఖ ఎయిర్ పోర్టు నుంచి నిర్వహిస్తున్నాయి.

నేవీ ఆటంకాలేమిటి ?

క్లోజింగ్ టైంను తగ్గించుకోవాలని నేవీ చెబుతోంది. రాత్రి 9 గంటల నుంచి ఉదయం 8 వరకూ వారు తెలపగా మేం రాత్రి 10.30 గంటల నుంచి ఉదయం 5.30 లేదా 7 గంటల వరకూ అవకాశం ఇవ్వాలని కోరాం. సానుకూల స్పందన వస్తుందని ఆశిస్తున్నాం.

ఎయిర్‌పోర్టులో అధునాతన వసతులేమైనా ఉన్నాయా?

ప్రస్తుతం ప్రయాణికుల లగేజీ తనిఖీలు స్కానింగ్ అంతా మాన్యువల్‌గా జరుగుతోంది. త్వరలో ఐఎల్‌బిఎస్ అంటే ఇన్‌ల్యాండ్ బాగేజ్ సిస్టం ప్రవేశపెట్టబోతున్నాం. ఎయిర్ కార్గో వాల్యూమ్ పెంచేందుకు కృషిచేస్తున్నాం. ప్రస్తుతం రోజుకు 12 టన్నులు ఎగుమతులు జరుగుతోంది. కార్గో జనరేషన్ కోసం టెండర్లు కూడా పిలిచాం.

ఏయే ఉత్పత్తుల ఎయిర్ కార్గో జరుగుతోంది ?

రొయ్యలు, ఫార్మా మందులు, ఆటో మొబైల్ పార్టులు, టెక్స్‌టైల్స్ వంటి ఉత్పత్తులు ఇక్కడ నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్తున్నాయి. కార్గో పరిమాణాన్ని పెంచడానికి సంబంధించిన డెడికేటెడ్ ఫ్లైట్ సర్వీసు లేదు. ఇదో పెద్ద సమస్యగా ఉంది.

ఎయిర్ పోర్టు చేపట్టే ఇతర కార్యక్రమాలేంటి ?

ఈ ఏడాది ఆగస్టు 16 నుంచి 22 వరకూ ఆలిండియా టేబుల్ టెన్నిస్ టోర్నమెంట్ (టిటి గేమ్స్) నిర్వహిస్తున్నాం. విశాఖపట్నం ఎయిర్ పోర్టు ఆతిథ్యం ఇస్తోంది. ప్రభుత్వ రంగ సంస్థలకు చెందిన ఆసక్తిగల టిటి ఆటగాళ్లను ఆహ్వానిస్తున్నాం. నగరంలోని స్వర్ణభారతి ఇండోర్ స్టేడియంలో జరిగే ఈ టోర్నమెంట్‌లో 20 పిఎస్‌యులకు చెందిన 200 మంది టిటి ఆటగాళ్లు పాల్గొననున్నారు. జాతీయ స్థాయి ప్లేయర్లు కూడా ఈ టోర్నమెంట్‌లో ఆడతారు. ఇది ర్యాంకింగ్ టోర్నమెంట్. దీంట్లో పాల్గొని విజేతలైతే ర్యాంకింగ్ పెరగనుంది.

బాబు పర్యటన విజయవంతానికి కృషి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ఈ నెల 15న విశాఖ బీచ్ రోడ్డులో జరిగే కార్యక్రమానికి హాజరవుతున్న టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబు నాయుడు పర్యటనను విజయవంతం చేయడానికి టిడిపి అనుబంధ సంఘాల నాయకులు కృషి చేయాలని టిడిపి ఉత్తరాంధ్ర జిల్లాల ఇన్‌ఛార్జి బుద్దా వెంకన్న పిలుపునిచ్చారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో పార్టీ విశాఖ పార్లమెంట్ నియోజకవర్గం అనుబంధ సంఘాల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శుల సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ విశాఖ పార్లమెంటు అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, మాజీ మంత్రి, ఉత్తర ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి పాల్గొన్నారు.

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : గతం కంటే అవయవదానంపై ప్రజల్లో అవగాహన పెరిగిందని విశాఖ జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున అన్నారు. ప్రపంచ అవయవదాన దినోత్సవం సందర్భంగా ఆదివారం గురజాడ కళాక్షేత్రంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అవయవదానం చేసిన వారి కుటుంబీకులను ఘనంగా సన్మానించారు. అనంతరం మాట్లాడుతూ వైద్య రంగానికి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఎంతో ప్రాధాన్యత ఇస్తున్నారని, పదహారేళ్ల బాలునికి జీవన్‌దాన్‌లో కోట్ల రూపాయలు ఖర్చు చేసి హార్ట్ ట్రాన్స్‌ప్లాంటేషన్ ఉచితంగా చేయించారని చెప్పారు. ప్రజలకు ఉచిత వైద్యం అందించే విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ఎల్లప్పుడూ ముందుంటుందన్నారు. అవయవదానంపై రాష్ట్రవ్యాప్తంగా మూడేళ్లగా అనేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో జీవన్‌దాన్ కార్యక్రమం ద్వారా అవయవాల సేకరణ, మార్పిడి చేపట్టే విధంగా చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. రాష్ట్ర జీవన్‌దాన్ కో-ఆర్డినేటర్, విమ్స్ డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబు మాట్లాడుతూ రాష్ట్రంలోనే తొలిసారిగా ప్రభుత్వ ఆసుపత్రిలో అవయవదానం చేసి ట్రాన్స్‌ప్లాంటేషన్ నిర్వహించిన ఘనత విమ్స్ ఆసుపత్రికి దక్కిందన్నారు. అవయవ దానం చేసిన కుటుంబ సభ్యులకు విశాఖ నగరంలోని కిమ్స్ ఆసుపత్రిలో ఉచిత కన్సల్టెన్సీ సేవలతో పాటు ఆసుపత్రి బిల్లు విషయంలో 50 శాతం రాయితీ కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర రెడ్ క్రాస్ సంస్థల అధ్యక్షులు డాక్టర్ శివ నాగేందర్ రెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పి.జగదీశ్వర్‌రావు, విమ్స్ ఆసుపత్రి వైద్యులు, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.



అవయవదాతల కుటుంబీకులను సత్కరిస్తున్న కలెక్టర్

శాస్త్రీయ విద్యా విధానం అవసరం

(మొదటి పేజీ తరువాయి..)

విస్మరిస్తున్నాయన్నారు. విద్య, వైద్యం, ఆరోగ్యం, పర్యావరణ రంగాలన్నీ ప్రయివేటీకరణ, కార్పొరేటీకరణ జరగడం ఆందోళనకరమన్నారు. మహిళా సాధికారకత, మహిళా భద్రత అంశాలలో ప్రభుత్వాల తీరు ఆందోళన కలిగిస్తోందన్నారు. ప్రభుత్వం మూఢనమ్మకాల నిరోధక చట్టం చేయాలని కోరారు. మతతత్వ శక్తులు, సూడో సైన్సు ప్రచారాలతో సమాజాన్ని వారివారి ఆర్థిక, రాజకీయ ప్రయోజనాల కోసం ప్రజలను తప్పుదారి పట్టిస్తూ దోపిడీ చేస్తున్నారని విమర్శించారు. అన్ని స్కూళ్ల వారు చెకుముకి సైన్సు పత్రికకు చందాదారులుగా చేరి ఆ పత్రికను విద్యార్థులచే చదివించాలన్నారు. సభలో డాక్టర్ రమేష్ కుమార్, వేదిక రాష్ట్ర కమిటీ సభ్యులు పివి.గోపాలరావు, ప్రజా ఆరోగ్య వేదిక నాయకులు కెవిపి.చంద్రమౌళి, ప్రయివేట్ స్కూల్స్ యూనియన్ అధ్యక్షులు డాక్టర్ ఎస్ శ్రీనివాస్ మాట్లాడారు.

నూతన కమిటీ ఎన్నిక

అనంతరం జెవివి నూతన జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా ఎస్‌వికె.పరశురాం, జిల్లా ప్రధాన కార్యదర్శిగా కె.శేషగిరి, కోశాధికారిగా ఎస్‌వి.రమణ, మహిళా విభాగం సమత కన్వీనరుగా ఇందా శ్రీనివాసన్, గౌరవ అధ్యక్షులుగా డాక్టర్ ఎన్ఎస్.రాజు, అడ్వైజర్లుగా డాక్టర్ రమేష్ కుమార్, సిహెచ్.శుభకర్, డాక్టర్ ఎస్.శ్రీనివాస్ ఎన్నికయ్యారు.

సంతానలేమి సమస్యలకు చెక్ పెట్టండి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : సంతానం లేని జంటలకు అసాధారణమైన చికిత్స, అత్యుత్తమైన సంరక్షణ అందించడంలో ఒయాసిస్ ఫెర్టిలిటీ క్లినిక్ ముందంజలో ఉందని హెడ్ ఫెర్టిలిటీ స్పెషలిస్ట్ డాక్టర్ రాధిక పొట్లూరి తెలిపారు. సంస్థ ఐదో వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని నగరంలోని ఓ హోటల్లో ఆదివారం వేడుకలను ఘనంగా నిర్వహించారు. వైజాగ్ యూనిట్ సహకారంతో గర్భం దాల్చిన జంటలకు సత్కరించి కేక్ కటింగ్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ దేశంలోనే ప్రముఖ సంతానోత్పత్తి కేంద్రాలలో ఒకటిగా ఉన్న తమ సంస్థ అధిక విజయాలు సాధిస్తోందని తెలిపారు. సంతాన లేమి సమస్యలతో ఉన్నవారిలో ఆనందాన్ని నింపడమే తమ ధ్యేయమని అన్నారు. కార్యక్రమంలో ప్రముఖ గైనకాలజిస్టులు పాల్గొన్నారు.

రుషికొండపై రాద్ధాంతం దేనికి ?

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : 'పవన్ కల్యాణ్‌కు రుషికొండపై ఎందుకు అంత ప్రేమ. ఎప్పుడు విశాఖపట్నం వచ్చినా రుషికొండకే వెళ్తారు. ఎదురుగా లోకేష్ బంధువుకు చెందిన గీతం యూనివర్సిటీకి వెళ్లవచ్చు కదా ?' అని ఎమ్మెల్సీ వరుదు కల్యాణి అన్నారు. ఆదివారం ఉదయం మద్దిలపాలెంలోని వైసిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. రుషికొండపై అనవసర రాద్ధాంతం దేనికన్నారు. విశాఖ అభివృద్ధిని పవన్ అడ్డుకుంటున్నారని అన్నారు. ప్రతిపక్షాలు, ప్రతిపక్ష మీడియా వేధించడం వల్లే ఎంపీ ఎంవివి.సత్యనారాయణ విశాఖ నుంచి వెళ్లిపోతానని అన్నట్లు చెప్పారు.

అయ్యప్ప భక్తులకు సేవలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : అయ్యప్ప భక్తులకు విశేష సేవలందిస్తామని అఖిల భారత అయ్యప్ప ధర్మ ప్రచారసభ జాతీయ కార్యవర్గం తెలిపింది. కార్యవర్గం ఎన్నికలు ఆదివారం విశాఖ నగరంలోని శంకర మఠంలో జరిగాయి.. జాతీయ అధ్యక్షులుగా కె.అయ్యప్ప దాస్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆయనతో పాటు జాతీయ కార్యవర్గంలో 21 మంది సభ్యులుగా ఉన్నారు. నూతన కమిటీ ఎన్నిక అనంతరం వారు మాట్లాడుతూ అయ్యప్ప స్వామి భక్తుల అవసరాలు తీరుస్తామన్నారు.

పవన్ పర్యటనపై ఆంక్షలెందుకు ?

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : పవన్ పర్యటనపై కొద్ది రోజులుగా ప్రభుత్వం ఆంక్షలు విధించి ఆటంకాలు కల్పించడం దారుణమని జనసేన నాయకులు పంచకర్ల రమేష్ బాబు అన్నారు. ఆదివారం మధ్యాహ్నం ఉషోదయ జంక్షన్‌లోని ఉషోదయ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ పెందుర్తిలో వార్డు వాలంటీర్ చేతిలో హతమైన వరలక్ష్మి కుటుంబాన్ని వైసిపి నాయకులు పరామర్శించక పోవడం శోచనీయమన్నారు. విశాఖ ఎంపీకి ఎలా మాట్లాడాలో కూడా తెలియదని అన్నారు. ఎంపీ ఎంవివి.సత్యనారాయణ చేపట్టిన ప్రాజెక్టులన్నీ అనధికార భూముల్లోనే ఉన్నాయన్నారు.

మహారాజశ్రీ అనకాపల్లి ప్రధాన సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
E·A 149/2023 IN E.P 31/2015
IN O.S 61/2014

బిట్వీన్ :
సత్రబోయిన సింహాచలం
...పిటీషనర్/ప్లెయింటిఫ్ 3rd పార్టీ
అండ్
కాంద్రేగుల రాముడు మరియొకరు
...రెస్పాండెంట్లు
టు
2వ రెస్పాండెంట్ :- లోపింటి శ్రీనివాస్
S/o లేటు మోహనరావు, హిందూ, వయసు 41 సం॥లు డోర్ నెం.13-67, మధురానగర్, గాంధీనగరం వెనుక, అనకాపల్లి, అనకాపల్లి జిల్లా.

పై నెంబరు E.Pలో కోర్టు వారు పంపిన నోటీసులు మీరు అందుకోనందున శ్రీ కోర్టు వారు మీ హాజరు నిమిత్తం **24-08-2023** తేదీకి వాయిదా వేసి యున్నారు. కావున ఆరోజు **ఉ॥10:30 ని॥ లకు** మీరు స్వయంగా గాని లేక తరుపున లాయరు గారి ద్వారా గాని పై కోర్టులో హాజరై మీకు గల ఆక్షేపనలు తెలుపుకొనవలెను లేనిచో మీ పరోక్ష మందు పై నెంబరు E.P తీర్మానించబడును.

M. జయరాం,
B.S.V.రాజుగోపాల్
K.సంతోష్ కుమార్
అడ్వకేట్స్, అనకాపల్లి

IN THE HON'BLE COURT OF THE VII ADDL SENIOR CIVIL JUDGE AT VISAKHAPATNAM
E.A.6/2021 in I.A.9/2017 in Dispute No.375/2013

Between
M/s Chalapathi Chit Fund (P) Ltd.,Vsp.
...Petitioner/ Decree Holder
And
Mrs. B.Durga Devi & Others
...Respondent/ Judgment Debtors
To
Mr.Karre Prakasa Rao, S/o Subba Rao (Late). Hindu, aged 55 years. W/as : Foreman(S), Emp No 110444. Traffic (F/S) Dept.(6000), Visakhapatnam Steel Plant, Visakhapatnam. R/at Quarter No.121/1, Sector-V, Ukkunagaram, Visakhapatnam.
....Respondent/ Judgt. Debtor No.2

NOTICE

Please take notice that the Petitioner/DHR has filed the above E.A. for issuance of cheques for an amount of Rs.3,79,918-00 and the E.A. stands posted to **28-08-2023.** The notice sent through court & R.P. were returned unserved despite being sent to your correct address you have to appear before the court at **10-30 A.M. on 28-08-2023,** through your Advocate or in person, failing which the matter will be decided by the Hon'ble Court in your absence.

(BY ORDER OF THE COURT)
Sd/-
CH.AMARNATH
Advocate for the Decree Holder
VISAKHAPATNAM. MOBILE : 9393261744

మహారాజశ్రీ అనకాపల్లి ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S 218/2018

బిట్వీన్ :
ఆంధ్రా బ్యాంక్, గవరపాలెం బ్రాంచ్ అనకాపల్లి, రిఫ్ బై ఇట్స్ బ్రాంచ్ మేజర్
...ప్లెయింటిఫ్
అండ్
జోగినాపల్లి శ్రీనివాసరావు వగైరాలు
...డిఫెండెంట్స్

2,3 డిఫెండెంట్స్‌కు సమన్లు

టు
2) జోగినాపల్లి శైలజ, W/o శ్రీనివాసరావు, హిందు, వయసు 46 సం॥లు, ప్రోజెక్ట్ కో-ఆర్డినేటర్, ఆక్వా బియాన్ ఏంటా రెసిడింగ్, డోర్ నెం.50-48-1, 2వ ఫ్లోర్ లక్ష్మీవైభవం, P&T కోలనీ, సీతమ్మధార, విశాఖపట్నం-13.
3) D.T.B నరసింహాస్వామి,
S/o D.T. రామానుజా చార్యులు, హిందు, వయసు 53 సం॥లు, ఫోర్‌మేన్, విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్, డోర్ నెం. 43-16-23/5-, స్నేహా అపార్ట్‌మెంట్స్ సుబ్బలక్ష్మి నగర్, విశాఖపట్న-31

పై నెంబరు దావాలో కోర్టువారు పంపిన సమన్లు మీరు అందుకోనందున శ్రీకోర్టు వారు మీ హాజరు నిమిత్తం **18-08-2023** తేదీకి వాయిదా వేసి యున్నారు కావున ఆరోజు **ఉ॥ 10:30ని॥లకు** మీరు స్వయంగా గాని లేక మీతరపు లాయరు గారు ద్వారా గాని పై కోర్టులో హాజరై మీకు గల ఆక్షేపనలు తెలుపుకొనవలెను. లేనిచో మీ పరోక్షమందు పై నెంబరు దావా తీర్మానించబడును.

CH. S S రామచంద్రరావు
అడ్వకేట్, అనకాపల్లి,

IN THE HON'BLE COURT OF THE PRINCIPAL SENIOR CIVIL JUDGE AT : VISAKHAPATNAM
S.O.P. 16/2023

Between:
Ms.Vesapogu (Devarapalli) Joycee
...Petitioner
And
Nil
...Respondent

GENERAL NOTICE

This is to inform to all General Public that Ms. Vesapogu (Devapalli) Joycee, D/o. late Ch. R. Beneena, R/at D.No. 1-43-9 & 10 Sector-8, Aadarshnagar, Beside Sivaji Park, Pedawaltair, Visakhapatnam-530017, filed above SOP to issue Succession Certificate to the petitioner in respect of schedule A to C properties i.e., A cash an amount of Rs.1,54,000/- lying in Post Office, Lawsonsbay Colony, Visakhapatnam on the name of Smt. Choutapalli Rachel Beneena, W/o. late Jyothi Prasad vide Account bearing No.9446175505, Scheme: SB (FPB), A cash an amount of Rs.1,26,000/- lying in Central Bank of India, Gandhigram Branch, Scindia, Visakhapatnam-530005 on the name of Smt. Choutapalli Rachel Beneena, W/o. late Jyothi Prasad, vide Account bearing No.1314717866, A cash an amount of Rs.10,00,000/- lying in Andhra Bank (Now merged in Union Bank of India) Lawsons bay Colony branch Visakhapatnam-530017, on the name of Smt. Choutapalli Rachel Beneena, W/o. late Jyothi Prasad, vide FDR No.063320100192478, dated 28-08-2017. Therefore the public in general are hereby informed that if anyone having objections in the above matter, please appear before the above Hon'ble Court on **17-08-2023** at about **10:30 A.M.** and intimate the objections, failing which the matter will be decided exparte in your absence.

T. JEEVAN, Advocate
Visakhapatnam-13.

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా పార్కు



అధ్వానంగా తయారైన మయూర్‌నగర్ పార్కు

ప్రజాశక్తి - ఆరిలోవ : జివిఎంసి 12వ వార్డు పరిధి ఆరిలోవ టిపిసి పాయింట్ వద్ద ఉన్న మయూర్‌నగర్‌లో పార్కు అధ్వానంగా తయారైంది. చీకటి పడితే ఈ పార్కు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతోంది. మయూర్‌నగర్ లే-అవుట్‌లో నివాసాల మధ్య ఉన్న ఈ పార్కులోకి ఎవరినీ అనుమతించక పోవడం, పార్కుకు తాళాలు వేసి ఉండడంతో ఎవరూ అక్కడకు వెళ్లక పోవడంతో చాలా కాలం నుంచి నిర్మానుష్యంగా మారింది. జివిఎంసి నిధులతో ఏర్పాటుచేసిన ఈ పార్కులో పిల్లలు ఆడుకునేందుకు ఆటవస్తువులు, పెద్దలు సేద తీరేందుకు బల్లలు ఉన్నాయి. వాటి వాడకం లేకపోవడంతో పాడైపోయాయి. పార్కు అంతా చెత్త, పిచ్చి మొక్కలతో నిండిపోయింది. నిర్మానుష్యంగా మారిన ఈ పార్కులోకి ఇప్పుడు గంజాయి మూకలు ప్రవేశిస్తున్నాయి. చీకటి పడితే గోడ దూకి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. ఈ పార్కు నివాసాల మధ్య ఉండడంతో రాత్రి సమయంలో ఇళ్లలోకి చొరబడతారేమోనని స్థానికులు భయందోళన చెందుతున్నారు. ఈ విషయమై కాలనీ వాసులు వార్డు కార్పొరేటర్, ఆరిలోవ సిఐ దృష్టికి తీసుకెళ్లారు. పార్కుకు తాళాలు వేయడం, పార్కు పరిసరాలను శుభ్రం చేయక పోవడం, ఎవరూ రాకపోవడంతోనే ఇటువంటి పరిస్థితి ఏర్పడిందని కాలనీ నాయకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై పోలీసుల పహరా ఉంటుందని, ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా చూస్తామని కాలనీ వాసులకు హామీ ఇచ్చారు. ఇప్పటికైనా కాలనీ పెద్దలు పార్కుకు తాళాలు వేయకుండా అందరికీ ప్రవేశం కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.



పాడైపోయిన బల్లలు

నేరాలు ఘోరాలు

బైక్‌ను ఢీకొన్న ఆటో : వ్యక్తికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలోని కృష్ణదేవిపేట పిహెచ్‌సి సమీపంలో ఆదివారం బైక్‌ను ఆటో ఢీకొట్టిన సంఘటనలో ఒక వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. కొయ్యూరు మండలం పాడి గ్రామానికి చెందిన నడిగట్ల రమణ(28) బైక్‌పై వస్తుండగా ఆటో ఢీకొంది. ఈ ప్రమాదంలో రమణ గాయపడ్డాడు. రమణ గొలుగొండ పిహెచ్‌సి ల్యాబ్ టెక్నీషియన్‌గా పని చేస్తున్నారు. ఈ ఘటనపై కృష్ణదేవిపేట పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

బంగారం, నగదు అపహరణ

ప్రజాశక్తి-చోడవరం : గాంధీగ్రామం పంచాయితీ మారుతీనగర్‌లో గార్నాల దేవి ఇంట్లో శనివారం రాత్రి దొంగల పడి మూడు తులాల బంగారం, రూ.1.10లక్షల నగదు అపహరించారు. దేవి స్థానిక హాస్టల్‌లో నైట్‌వాచ్ ఉమెన్‌గా పనిచేస్తున్నారు. ఆమె కుమారుడు ఇంట్లో ఉంటూ, రాత్రి మేడ పైకి వెళ్లి నిద్రపోయాడు. ఇదిగమనించిన దొంగలు ఇంటి లోపల బీరువా పగలగొట్టి, బంగారం, నగదును అపహరించుకుపోయారు. అందిన ఫిర్యాదు మేరకు స్థానిక పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

మీనామృతంతో పంటల సస్యరక్షణ

ప్రజాశక్తి -పద్మనాభం : మండలంలోని పొట్నూరు గ్రామంలో ఐసిఆర్‌పిలు హేమలత, మీనా ఆదివారం రైతుల సమక్షంలో 10 కేజీల మీనామృతం తయారీని చేసి చూపించారు. 10 కేజీల బెల్లం, 10 కేజీల చేపలపొట్టు ముందుగా సేకరించి వాటితో మీనామృత తయారీ విధానాన్ని రైతులకు వివరించారు. ఈ తయారీ విధానాన్ని మోడల్ మేకర్ పద్మ పరిశీలించారు. ఫార్మర్ సైంటిస్ట్ సురేష్ రైతులకు అవగాహన కల్పించారు. ఇటువంటి ఎరువులతో పండించిన పంటలకు తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడి సాధించవచ్చని, ఆరోగ్యకరమైన ఆహార పదార్థం తయారుచేసుకోవచ్చని వివరించారు.



నృత్య ప్రదర్శనలిస్తున్న చిన్నారులు

శిల్పారామంలో శాస్త్రీయ, జానపద నృత్యాలు

ప్రజాశక్తి -పిఎం.పాలెం : వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా మధురవాడ శిల్పారామంలో సిరి డ్యాన్స్ అకాడమీ వారిచే శాస్త్రీయ, జానపద నృత్యాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గజానన, మూషిక వాహన, గోవిందా, మహా కనక దుర్గ, స్వాగతం, అలివేలు మంగతో, లక్ష్మి దేవి పాట, భారత వేదమున, రామ రామ, వెయ్యి నామాల వాడ, రఘువంశ, ఒకపరి, శుద్ధ బ్రహ్మ, కొండలలో నెలకొన్న, ముకుందా ముకుందా తదితర అంశాలను ప్రదర్శించారు. శరణ్య, రియా, హరిత, కుందన, వర్షిత, వర్షిణి, భావన, ఝాన్సి, రేవతి, సిరి, దివ్య, భార్గవి, మౌనిక, నాగలక్ష్మి కళాకారులు నృత్యాలు ప్రదర్శించి సందర్శకులను విశేషంగా ఆకట్టుకున్నారని శిల్పారామం పరిపాలనాధికారి టి.విశ్వనాథ్‌రెడ్డి తెలిపారు.

ఉచిత హోమియో వైద్యశిబిరం

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక కలిగొట్ల స్నిగ్ధ శ్రీదేవి ఫౌండేషన్ ఆధ్వర్యాన చిన్న బజారులోని ఫౌండేషన్ కార్యాలయంలో ఆదివారం ఉచిత హోమియో వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని ఫౌండేషన్ చైర్మన్ కె.శ్రీరామచంద్రమూర్తి ప్రారంభించారు. 95 మందికి వైద్యులు టి.జగన్నాథరావు, టిజె.మోహన్ పరీక్షలు జరిపి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు కెఎస్ఎన్.మూర్తి, కె.చంద్రశేఖర్, కెవి.భానోజీరావు, కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బంగారయ్య మృతికి సిపిఎం సంతాపం



నివాళులర్పిస్తున్న మూర్తి, రవ్వ నర్సింగరావు తదితరులు

ప్రజాశక్తి- తగరపువలస : భీమిలి మండలం, దాకమర్రి పంచాయతీ ముద్దాడపేటకు చెందిన సిపిఎం సానుభూతిపరుడు ముద్దాడ బంగారయ్య (85) ఆదివారం అనారోగ్యంతో ఇంటి వద్ద మృతి చెందాడు. బంగారయ్య భౌతిక కాయాన్ని సిపిఎం భీమిలి జోన్ అధ్యక్ష, కార్యదర్శులు ఆర్ఎస్ఎన్ మూర్తి, రవ్వ నరసింగరావు, జోన్ కమిటీ సభ్యులు వి.నాగరాజు, ఎస్.అప్పలనాయుడు, ఎస్.వర్మ, చిల్ల అప్పారావు, ఎస్.గున్న, భాగం లక్ష్మి తదితరులు సందర్శించి ప్రగాఢ సంతాపం, కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. బంగారయ్య దాకమర్రి ఎంపిటిసి సభ్యునిగా పోటీ చేశారని, సిపిఎం, సిఐటియు అభివృద్ధికి, ఆయన ఎంతగానో కృషి చేశారని కొనియాడారు. అతని కుమారుల్లో ఒకరు రాము పార్టీలో, సిఐటియులో క్రియాశీలకంగా పనిచేస్తున్నారు.

ఎస్‌సి కాలనీ వాసుల వివరాల సేకరణ

ప్రజాశక్తి -పిఎం పాలెం : కొమ్మాది దేవీమెట్ట సమీపంలో ఉన్న ఎస్సీ కాలనీలో జిల్లా కలెక్టర్, ఆర్‌డిఒ ఆదేశాల మేరకు చిన్నగదిలి మండల రెవెన్యూ అధికారులు ఆదివారం నిరుపేదల వివరాలు సేకరించారు. ఎన్నో ఏళ్ల నాటి నుండి కొమ్మాది దేవి మెట్ట ఎస్సీ.కాలనీ సమీపంలో 60 మంది నిరుపేదలు పాకలు వేసుకొని జీవనం కొనసాగిస్తున్నారు. అక్కడ నివసిస్తున్న నిరుపేదలకు వేరేచోట నివాస స్థలం ఏర్పాటుచేసి జగనన్న ఇళ్ల పట్టాలను అందించారు. ఉన్నచోటే పట్టాలు ఇప్పించాలని కోరుతూ వారుతూ ఆ పట్టాలను తిరస్కరించారు. ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్, మంత్రుల దృష్టికి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు తీసుకువెళ్లారు. దీనిపై కలెక్టర్ స్పందించి అక్కడ అర్హులుగా ఉండి ఎప్పటినుండో నివాసం ఉంటున్న పేదలను గుర్తించాలని ఆదేశాలు జారీ చేశారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు అర్హులను గుర్తించే ప్రక్రియను చేపట్టారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఆర్‌ఐ ప్రవీణ్‌కుమార్, వీఆర్వో సూరిబాబు, కనకరాజు సియాద్రి, వైసిపి నాయకులు గుంటుబోయిన సంజీవ్‌యాదవ్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా తెల్లపులి జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి - ఆరిలోవ : ఇందిరాగాంధీ జంతుప్రదర్శనశాలలో తెల్లపులి పీచెస్ ఐదవ జన్మదిన వేడుకలను ఆదివారం విద్యార్థులు, సందర్శకులు, జంతు ప్రేమికుల మధ్య ఉత్సాహంగా నిర్వహించారు. ప్రత్యేకంగా రూపొందించిన వైట్ టైగర్ థీమ్ కేక్‌ను జూ క్యూరేటర్ డాక్టర్ నందనీ సలారియా కట్‌చేశారు. విద్యార్థులందరూ వైట్ టైగర్ మాస్కులు ధరించి పీచెస్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. వైట్ టైగర్ పీచెస్ సంక్షేమానికి దోహదపడేందుకు సిపిఐ జూనియర్ కాలేజీ యాజమాన్యం ముందుకు వచ్చింది. పీచెస్‌ను నెల రోజుల పాటు కాలేజీ యాజమాన్యం దత్తత తీసుకుంది. నెల రోజులకు పీచెస్ ఆహారానికి అయ్యే ఖర్చును సిపిఐ కాలేజీ యాజమాన్యం భరించనుంది. పీచెస్‌ను నెల రోజుల పాటు దత్తత తీసుకున్నందుకు కాలేజీ యాజమాన్యానికి జూ క్యూరేటర్ డాక్టర్ నందనీ సలారియా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ క్యూరేటర్లు గోపి, గోపాలనాయుడు, ఎఫ్ఎస్ఒ భారతి, సిపిఐ జూనియర్ కాలేజీ ప్రిన్సిపల్ పాల్గొన్నారు.

పేడ, మూత్రం, ఇంగువ ద్రావణంతో పంటలకు మేలు

ప్రజాశక్తి- ఆనందపురం : పేడ, మూత్రం, ఇంగువ ద్రావణం మిశ్రమం పంటలు పెరుగుదలకు ఎంతో మేలు చేస్తుందని ప్రకృతి వ్యవసాయ సిఎ రామారావు పేర్కొన్నారు. ఆనందపురం మండలం తర్లువాడ గ్రామంలో ఆదివారం పంటకు మేలు చేసే పేడ మూత్రం ఇంగువ ద్రావణం తయారీ విధానం గురించి ప్రకృతి వ్యవసాయ రైతులకు వివరించారు. ఈ ద్రావణం తయారీకి 5 లీటర్ల నీరు, 5 కేజీల పేడ, 5 లీటర్ల ఆవు మూత్రం కలిపి 4 రోజులు మురగబెట్టాలనీ, 5వ రోజు 100 గ్రా ఇంగువను వేడి నీటిలో మరగబెట్టి ఈ ద్రావణంలో కలిపి వాడుకోవాలన్నారు. ఈ విధంగా తయారైన 10 లీటర్ల ద్రావణాన్ని 100 లీటర్ల నీటిలో కలిపి ఒక ఎకరానికి పిచికారి చేసుకోవాలన్నారు. ఈ ద్రావణాన్ని పిచికారి చేసుకోవడం వల్ల పంటలో వచ్చే బాక్టీరియా తెగుళ్లను నివారించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐసిఆర్‌పిలు, రైతులు పాల్గొన్నారు.

సందడిగా పూర్వ విద్యార్థుల కలయిక

ప్రజాశక్తి -పిఎం.పాలెం, భీమునిపట్నం : మధురవాడ చంద్రంపాలెం జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల 1987-88 సంవత్సరం 10వ తరగతి విద్యార్థులు 35 సంవత్సరాల తరువాత అప్పటి ఉపాధ్యాయులతో ఆదివారం ఆత్మీయ కలయిక నిర్వహించారు. ఈ సందర్భంగా అప్పటి ఉపాధ్యాయులు, విద్యార్థులు ఒకరికొకరు ఆత్మీయంగా పలకరించుకున్నారు. నాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. ముందుగా పాఠశాల ప్రాంగణంలో ఉన్న సరస్వతీ దేవి విగ్రహం వద్ద పూజలు నిర్వహించారు. అనంతరం అక్కడే ఉన్న మహాత్మాగాంధీ, అబ్దుల్ కలాం విగ్రహాలకు పూల మాలలు వేశారు. అనంతరం ఒకరినొకరు యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అప్పటి ప్రధానోధ్యాయులు ఎం.సుబ్బారావు, జి.శ్యామల, తెలుగు ఉపాధ్యాయులు కెవిఎస్ఎస్.శర్మ, ఆరవెల్లి బుచ్చిబాబు, కెవి.రమణమూర్తి, జె.ఆనంద్, ఎం.విజయలక్ష్మి, జి.సుహాసిని, ప్రస్తుత ప్రధానోధ్యాయులు ఎం.రాజబాబులను సత్కరించి, జ్ఞాపికలను అందజేశారు. చంద్రంపాలెం ఉన్నత పాఠశాల ఆవిర్భావం తరువాత మొదటి పదవ తరగతి పరీక్షల్లో ప్రథమ స్థానంలో ఉత్తీర్ణులైన లొడగల మాధవరావును కూడా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పిళ్లా కృష్ణమూర్తిపాత్రుడు, పిళ్లా సూరిబాబు, పోతిన శివలింగేశ్వరరావు, టిఎస్ఎస్.రాజు, పోతిన రాము, వానపిల్లి ముత్యాలరావు, మంతెన పార్వతి, పోతిన శేషమాంబ, వరిపిల్లి శంకర్, గద్దెపిల్లి చిన్నఅప్పన్న, బెవర బాపూజీ, బొంతు శ్రీనివాసరావు, బలిరెడ్డి అప్పలరాజు, ఒమ్మి పోలినాయుడు, కె.గజలక్ష్మి, వి.విమల, లక్షి కుమారి, బోనెల రమేష్, హెచ్చెర్ల శ్రీను, ఎవి.కృష్ణారావు, ఇంటి రామారావు, దుంప సూరిబాబు, పోతిన నాయుడుబాబు బి.మీనాకుమారి తదితరులు పాల్గొన్నారు.

భీమునిపట్నం : స్థానిక సెయింట్ ఆన్స్ ఉన్నత పాఠశాలలో 1995-96లో టెన్త్ చదివిన సుమారు 60 మంది పూర్వ విద్యార్థినులు ఆదివారం పాఠశాల వద్ద కలుసుకున్నారు. చదువుకున్న నాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని యోగా క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయులను సత్కరించారు. పాఠశాల అభివృద్ధికి తమ వంతుగా కొంత మొత్తాన్ని పాఠశాల ఎడ్యుకేషన్ కో-ఆర్డినేటర్ సిస్టర్ దీపకు విరాళంగా అందజేశారు. పాఠశాల ఇన్‌ఛార్జి హెచ్‌ఎం వేలంగిణి, ఉపాధ్యాయులు లలిత, రాజ్యలక్ష్మి, నవోమి పాల్గొన్నారు.

దేశ సమగ్రతపై చిన్నారుల సైకిల్ ర్యాలీలు



మద్దిలపాలెం పిఠాపురం కాలనీలో సైకిల్ ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : 77వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని జాతీయ సమగ్రతపై ఇంటరాక్ట్ క్లబ్ ఆఫ్ విసిసి ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం పిఠాపురం కాలనీ నుంచి సైకిల్ ర్యాలీ ప్రారంభమైంది. రొటేరియన్ మోదాంబిక ఈ ర్యాలీని ప్రారంభించి మాట్లాడారు. పిల్లల్లో దేశభక్తిని పెంపొందించడం, లౌకికతత్వాన్ని అలవర్చడం, స్వాతంత్ర్య సమరయోధుల విశేషాలను తెలియజేయడం ముఖ్య ఉద్దేశంతో ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. విసిసి వ్యవస్థాపకులు డాక్టర్ కె.రమాప్రభ మాట్లాడుతూ భిన్నత్వంలో ఏకత్వం కోసం అందరం ప్రతిజ్ఞ చేద్దామన్నారు. దేశంలో మతసామరస్య విశిష్టతను తెలియజెప్పారు. అనంతరం పిల్లలు నినాదాలు ఇస్తూ సైకిల్ రైడ్ చేశారు. రైడ్ ముగింపులో రొటేరియన్ వినయ్ గాంధీ పాల్గొని సీడ్ ఫ్లాగ్స్‌ను పిల్లలకు అందించారు. ఈ సైకిల్ రైడ్ భానునగర్, హెచ్‌బి.కాలనీ మీదుగా అంజయ్యనగర్, గొల్లవీధి, ఫిషర్‌మెన్ కాలనీ, పెదజాలారిపేట, శివాజీపాలెం గుండా సాగింది. కార్యక్రమంలో విసిసి అధ్యక్షులు ఎస్.హరిత, ఆర్గనైజర్ మణి, వాలంటీర్లు గణేష్, నీలవేణి, నిఖిల్, వెంకట్, పిల్లలు శ్రావ్య, ప్రనీత్, గౌతమి, నందిని, పార్థు, మానస, సాయి పాల్గొన్నారు.

కలెక్టరేట్ : బుక్కా వీధి నుంచి జగదాంబ జోన్ ఆధ్వర్యంలో సైకిల్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమాన్ని జోన్ కన్వీనర్ ఎం.ఎల్లాజీ ప్రారంభించారు. ముగింపులో విసిసి పందిమెట్ట ఏరియా నిర్వాహకులు సత్య, మణి చల్లని పానీయాలను చిన్నారులకు అందించారు. ఈ ర్యాలీ బుక్కా వీధిలో ప్రారంభమై కల్లుపాకలు, కొబ్బరితోట మీదుగా జగదాంబ, ఆంథోని నగర్, పంది మెట్ట, జగదాంబ ఏరియాల్లో సాగింది. ఆర్గనైజర్లు మణి, సరోజిని, ఝాన్సీ, వాలంటీర్లు సాయి, జాహ్నవి, నరేష్, నితిన్, నవీన్, జయంత్, అభిరామ్ పాల్గొన్నారు.

విశాఖపట్నం: 77వ భారత స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఇంటరాక్ట్ క్లబ్ ఆఫ్ విసిసి ఆధ్వర్యాన ఆదివారం "జాతీయ సమగ్రత కోసం సైకిల్ ర్యాలీ"ని కంచరపాలెం బొట్ట నరసింగరావు ఫౌండేషన్ నుంచి ప్రారంభించి బర్మాకాంప్, ఊర్వశి జంక్షన్, దుర్గానగర్, కంచరపాలెం మెట్టు ప్రాంతాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణారావు మాస్టారు మాట్లాడుతూ, జాతీయ సమగ్రత, సార్వభౌమాధికారం మరియు భిన్నత్వంలో ఏకత్వం కోసం ప్రతిజ్ఞ చేద్దాం అని పిలుపునిచ్చారు. బలమైన దేశ నిర్మాణం కోసం, దేశం పట్ల పౌరుల బాధ్యతను తెలియజేయడం కోసం ఈ ర్యాలీ నిర్వహించామని విసిసి ప్రెసిడెంట్ ఎస్.హరిత తెలిపారు. సహకారం అందించిన రోటరీ క్లబ్‌కు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో విసిసి ఆర్గనైజర్లు సాయి, పావని, విద్యార్థులు పాల్గొన్నారు.



కంచరపాలెం ప్రాంతంలో సైకిల్ ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

జూనియర్ ఆర్టిస్టుల యూనియన్ ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి-సీతమ్మధార : ఆంధ్రప్రదేశ్ ఫిల్మ్ ఇండస్ట్రీ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఆధ్వర్యాన ఏపీ జూనియర్ ఆర్టిస్ట్ యూనియన్, డ్యాన్స్ డైరెక్టర్స్ కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకారం పౌర గ్రంథాలయంలో నిర్వహించారు. ఎమ్మెల్సీ వంశీకృష్ణ యాదవ్ ముఖ్యఅతిథిగా పాల్గొని నియామకపత్రాలను సభ్యులకు అందజేశారు. అనంతరం 500 మంది పేద కళాకారులకు నిత్యావసర వస్తువులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ వంశీకృష్ణయాదవ్ మాట్లాడుతూ, ప్రకృతి అందాలకు నిలయమైన విశాఖపట్నంలో చలనచిత్రాలు తీయుటకు ప్రభుత్వం ఎంతో సహకారం అందిస్తోందని తెలిపారు. ఫిల్మ్ ఇండస్ట్రీ విశాఖ నగరానికి తరలి రావడానికి వైసిపి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఫిల్మ్ ఇండస్ట్రీ ఎంప్లాయీస్ ఫెడరేషన్ అధ్యక్షులు రాజా, పెద్దలు రామారావు రమేష్, నాగేంద్రమ్మ, నిర్మల భాను, విజయరమణి, శివ, మేరీ, సూర్యవేణు, మేరీ, టిడ్కో ఛైర్మన్ ప్రసన్నకుమార్, రాధ, సుశీల పాల్గొన్నారు.

వైసిపి నాయకుల ఆత్మీయ సమావేశం

ప్రజాశక్తి-సీతమ్మధార : జివిఎంసి 53వ వార్డు పరిధి పంజాబ్ హోటల్ జంక్షన్ సమీపంలో ఉన్న పార్టీ కార్యాలయంలో వార్డు నాయకులు, కార్యకర్తల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. వార్డు కార్పొరేటర్ బర్కత్ అలి ఆధ్వర్యాన నిర్వహించిన సమావేశంలో ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెకె.రాజు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కష్టపడి పనిచేయాలని కోరారు. 2024లో జగన్మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలన్నారు. వార్డులో ఓటర్ల జాబితా పరిశీలన, సంక్షేమ పథకాల అమలు తీరు, అభివృద్ధి కార్యక్రమాలపై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో 53వ వార్డు వైసిపి అధ్యక్షులు గుజ్జు వెంకటరెడ్డి, కృష్ణారావు మాస్టర్, అమర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అన్యాక్రాంత భూముల పరిరక్షణకు మిషన్ కర్షక దేవోభవ

ప్రజాశక్తి-సీతమ్మధార : ఆంధ్రప్రదేశ్‌లో అన్యాక్రాంతమవుతున్న హిందూ దేవాలయాల భూములను పరిరక్షించుకునేందుకు మిషన్ కర్షక దేవోభవ ప్రధాన పాత్ర పోషిస్తోందని ఛైర్మన్ ఆడారి కిషోర్ కుమార్ తెలిపారు. విశాఖలోని ఓ ప్రయివేటు హోటల్లో ఆదివారం విశాఖపట్నం బ్రాహ్మణ శాఖల ఐక్యవేదిక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత 16 రోజులుగా రైతు, రైతాంగం అనుభవిస్తున్న వెతలను ప్రజల్లో అవగాహన కల్పిస్తూ కర్షకదేవోభవ మిషను ప్రచారం చేస్తున్నామన్నారు. దేవాలయాల నిర్వహణ కోసం ఎందరో దాతలు విరాళంగా ఇచ్చిన లక్షల ఎకరాల భూములను భూ కబ్జాదారులు స్వాహా చేయడం దారుణం అన్నారు. చాలా గ్రామాల్లోని అర్చకులు, బ్రాహ్మణులే వ్యవసాయం చేస్తూ వచ్చిన పంటలతో ఆలయాలను నిర్వహిస్తున్నారన్నారు. తమ మిషన్ లక్ష్యాలను బ్రాహ్మణ ప్రతినిధులకు వివరించారు. ఈ సమావేశంలో విశాఖ బ్రాహ్మణ సంఘాల ఐక్యవేదిక ప్రతినిధులు కొలిగట్ల సుబ్రహ్మణ్యం, సాయిరాం సివిఎస్, వంగూరి గణేష్, పూడి పెద్దిశర్మ, కావూరి చరణ్, పరిమి నాగేంద్ర, కొత్తలంక మురళీకృష్ణ, వి.శ్రీనివాసరావు, టివిఎన్.ప్రసాద్, శంకర్ నీలు, ఎం.ఉదయ్‌కుమార్, సూర్యభగవాన్, వడ్డాది ఉదయ్‌కుమార్, శివగణేష్, ఎం.కోటేశ్వరరావు, ఆర్చక, పురోహిత, బ్రాహ్మణ సంఘాల ప్రతినిధులు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

ఆచార్య రంగనాథన్ సేవలు చిరస్మరణీయమైనవి

ప్రజాశక్తి -ములగాడ : ఆచార్య ఎస్ఆర్.రంగనాథన్ గ్రంథాలయ శాస్త్రానికి చేసిన కృషి నిరుపమానమైనదని, ఆయన కృషి వల్లే గ్రంథాలయాలు క్రమ పద్ధతిలో నడుస్తున్నాయని ప్రముఖ న్యాయవాది జికెవి.రాజు అన్నారు. మల్కాపురంలోని శాఖా గ్రంథాలయంలో ఆదివారం ఎస్ఆర్.రంగనాథన్ జయంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జికెవి.రాజు మాట్లాడుతూ, తమిళనాడుకు చెందిన రంగనాథన్ మద్రాసు విశ్వవిద్యాలయ గ్రంథాలయాన్ని మోడల్ గ్రంథాలయంగా తీర్చి దిద్దారని చెప్పారు. భారత ప్రభుత్వం ఈయన సేవలను గుర్తించి పద్మశ్రీ అవార్డును ఇచ్చి సత్కరించిందని, ఈయన 80 సంవత్సరాల సంపూర్ణ జీవితాన్ని గడిపారని పేర్కొన్నారు. జాతీయ సేవా పథకం జిల్లా ప్రోగ్రాం అధికారి ఐపిఎస్. భాగ్యలక్ష్మి మాట్లాడుతూ, రంగనాథన్ యువతకు ఆదర్శప్రాయుడన్నారు. గ్రంథాలయంలో పాటించేందుకు ఆయన చెప్పిన ఐదు సూత్రాలు ప్రపంచవ్యాప్తంగా ప్రాచుర్యం పొందాయని తెలిపారు. సమావేశంలో ప్రముఖ రచయిత కె.సత్తిరాజు, ప్రముఖ కార్మిక నాయకులు బి.సత్యానందం, గ్రంథాలయాధికారి వి.అజయ్‌కుమార్ తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో హైమ, స్థానిక చిన్నారులు, యువత పాల్గొన్నారు. తొలుత అంతా రంగనాథన్ చిత్రపటానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు.


కార్మిక ప్రయోజనాలను విస్మరిస్తున్న మోడీ

ప్రజాశక్తి-సీతమ్మధార : కార్మిక ప్రయోజనాలను విస్మరించి, కార్పొరేట్ వర్గాల అభివృద్ధికి కేంద్రంలోని మోడీ సర్కార్ కృషి చేస్తోందని ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు ఆరోపించారు. ఎఐటియుసి విశాఖజిల్లా 13 వ మహాసభల సందర్భంగా రెండవరోజు రామాటాకీస్ సమీపంలోని ఎల్ స్క్వైర్ సమావేశ మందిరంలో ఏర్పాటుచేసిన ప్రతినిధుల సభలో ఓబులేసు ప్రారంభోపన్యాసం చేశారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం ఫాసిస్ట్ ధోరణికి వ్యతిరేకంగా పోరాటం నిర్వహించాలని ఓబులేసు పిలుపునిచ్చారు. సామాజిక సేవా రంగంలో బడ్జెట్ కేటాయింపులు తగ్గించడం, విదేశీ పెట్టుబడులు ఆహ్వానించడం వంటి నిర్ణయాలు దేశం ఆర్థిక దివాళా తీస్తోందని విమర్శించారు. నష్టాల సాకుతో విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రయివేటుపరం చేయడానికి కేంద్రం చర్యలు చేపట్టిందన్నారు. నేడు అన్నీ రంగాల్లో పనిచేస్తున్న కార్మికులు కనీసవేతనం కూడా అందని దయనీయమైన స్థితిలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు కోడ్లుగా చేసిందన్నారు.

మహాసభల సందర్భంగా ఎఐటియుసి జెండాను యూనియన్ సీనియర్ నాయకులు బిసిహెచ్ మసేన్ ఎగురవేశారు. అనంతరం నూతన నాయకత్వాన్ని ఎన్నుకున్నారు. ఎఐటియుసి విశాఖ జిల్లా అధ్యక్షులుగా ఎం.మన్మధరావు, ప్రధాన కార్యదర్శిగా జిఎస్‌జె.అచ్యుతరావు ఎన్నికయ్యారు.

ఉత్సాహంగా హాస్యవల్లరి

ప్రజాశక్తి-సీతమ్మధార : విశాఖ హ్యూమర్ క్లబ్ ఆధ్వర్యాన ఆదివారం పౌర గ్రంథాలయంలో హాస్య వల్లరి కార్యక్రమం నిర్వహించారు. నవ్వడం నవ్వించడం మనిషికి ఎంతో ఆరోగ్యకరమని విశాఖ హ్యూమర్ క్లబ్ అధ్యక్షులు రావి గోపీకృష్ణ అన్నారు. ప్రస్తుత రోజుల్లో బిజీగా గడుపుతున్న ప్రజలు కాసేపు నవ్వడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందన్నారు. అనంతరం ప్రదర్శించిన స్కిట్స్ పలువురిని ఎంతగానో నవ్వించాయి. ఈ కార్యక్రమంలో హాస్యనటులు ఇమంది ఈశ్వరరావు పాల్గొన్నారు.



రోడ్డుకడ్డంగా వేసిన మట్టి

రోడ్డు ఆక్రమణపై ఆగ్రహం

ప్రజాశక్తి-పెందుర్తి : జివిఎంసి 95వ వార్డు మరిడిమాంబ కాలనీ సమీపంలోని హౌసింగ్ బోర్డు కాలనీ వాసుల రోడ్డును కప్పేశారు. గతంలో ఇక్కడ షెడ్డు నిర్మిస్తే ఎమ్మెల్యేకు, కార్పొరేటర్‌కు కాలనీవాసులు ఫిర్యాదు చేయడంతో ఆక్రమణను తొలగించారు. మళ్లీ ఇప్పుడు కొంత మంది రోడ్డును కప్పారు. హౌసింగ్ బోర్డ్ అసోసియేషన్ ఆధ్వర్యాన కార్పొరేటర్‌కు, తహశీల్దార్‌కు మళ్లీ ఫిర్యాదు చేసినా స్పందించకపోవడంతో హౌసింగ్ బోర్డ్ కాలనీ వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉన్నత అధికారులకు ఫిర్యాదు చేస్తామని అంటున్నారు. మండలంలో ఎక్కడ ఆక్రమణ జరిగినా తహశీల్దార్ స్పందించడంలేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

టిడిపి ఎన్నికల మ్యానిఫెస్టోపై ప్రచారం

ప్రజాశక్తి- పద్మనాభం : మండలంలోని కోరాడ, గద్దపేట, బుడ్డివలస, లింగన్నపేటలో ఆదివారం టిడిపి ఎన్నికల మేనిఫెస్టోపై పార్టీ రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షులు కె.లీలావతి ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రస్తుత ప్రభుత్వంలో ప్రజల ఇబ్బందులు, సమస్యలపై ప్రచారం చేశారు. తెలుగుదేశం అధికారంలోకి వస్తే మహిళలకు, యువతకు, నిరుద్యోగులకు పథకాలను వివరించారు.

సన్‌రైజ్ ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి -పెందుర్తి : గాజువాకకు చెందిన సన్‌రైజ్ చిల్డ్రన్ హాస్పిటల్ యాజమాన్యానికి చెందిన సన్‌రైజ్ చిల్డ్రన్ క్లినిక్ ఆధ్వర్యాన పెందుర్తి సుజాతనగర్, పాపయ్యరాజుపాలెంలో ఆదివారం పిల్లల ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ప్రముఖ పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ టి.తిరుపతిరావు, డాక్టర్ డి.సురేష్ ఆధ్వర్యాన పిల్లలకు వైద్య పరీక్షలు జరిపారు. అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తిరుపతిరావు మాట్లాడుతూ, గాజువాక, పెందుర్తి పరిసర ప్రాంతాల్లో తమ ఆసుపత్రి ఆధ్వర్యాన తరచూ ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తూ మందులు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని మెడికల్ క్యాంపులు నిర్వహిస్తామని చెప్పారు. ఈ సందర్భంగా ఆసుపత్రి యాజమాన్యానికి కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు.



పిల్లలకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ తిరుపతి, సురేష్

షిప్‌యార్డ్ టిఎన్‌టియుసి కార్యవర్గం ఎన్నిక



అధ్యక్షులుగా ఎన్నికైన మురళీధర్‌ను సత్కరిస్తున్న ఎమ్మెల్యే గణబాబు

ప్రజాశక్తి -ములగాడ : హిందుస్థాన్ షిప్‌యార్డ్ గుర్తింపు యూనియన్ అధ్యక్షు, కార్యదర్శులుగా ఊరుకూటి మురళీధర్, సిహెచ్.రామారావును కార్మికులంతా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గాజువాకలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం జరిగిన ఓ సమావేశంలో వారిని పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే పెతకంశెట్టి గణబాబు, విశాఖ పార్లమెంటరీ అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు పూలమాల, శాలువాతో సత్కరించారు. నూతనంగా ఎన్నికైన షిప్ యార్డ్ తారకరామారావు, వెల్ఫేర్ కమిటీ ఛైర్మన్ కూర్మారావులను అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా టిఎన్‌టియుసి అధ్యక్షులు నక్కా లక్ష్మణరావు, జిల్లా సెక్రటరీ కె.నానాజీ, గుర్తింపు యూనియన్ అధ్యక్షులు రమణమూర్తి, సెక్రటరీ ఎస్.చంటిబాబు, గౌరవాధ్యక్షులు ప్రసాద్, సిహెచ్.రమేష్, వెలగా నాగేశ్వరరావు, బివిఎన్.పాత్రో, జి.నర్సింగరావు, రాజాన అప్పారావు, రమణ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



కలుసుకున్న పూర్వవిద్యార్థులు

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని అంతకాపల్లి పంచాయతీ, రావులమ్మపాలెం జెడ్‌పి హైస్కూల్ 1994-95 బ్యాచ్ పదవ తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం అడ్డూరు మజ్జిగౌరమ్మ గుడి ఆవరణలో నిర్వహించారు. ఎక్కడెక్కడో ఉద్యోగ, ఉపాధిలో స్థిరపడిన వారంతా మళ్లీ ఒకచోట కలుసుకున్నారు. చిన్ననాటి మధుర జ్ఞాపకాలను, తీపి గుర్తులను, అల్లరి చేష్టలను గుర్తు చేసుకుంటూ ఆనందంగా గడిపారు. అనంతరం సహపంక్తి విందులో పాల్గొన్నారు. గ్రూపులుగా ఫోటోలు దిగి సందడి చేశారు. కార్యక్రమంలో సబ్బవరం వైస్ ఎంపిపి చొక్కాకుల గోవింద్, సబ్బవరపు చిన్నంనాయుడు, జక్కాన నాగేశ్వరరావు, కొల్లి రామనాయుడు, ఆదిరెడ్డి రమణ అనకాపల్లి ముత్యాలరావు ,బండారు విజయ్ కుమారి, మంగ , సిహెచ్ లక్ష్మి పాల్గొన్నారు.

జికెకు చంద్రబాబు అభినందన



చంద్రబాబుతో కొండలరావు

ప్రజాశక్తి -దేవరాపల్లి : 'మన టిడిపి' యాప్‌ను యాక్టివ్‌గా వినియోగిస్తూ, తెలుగుదేశం పార్టీ కోసం ఒక డిజిటల్ సైనికుడిగా నిరంతరం శ్రమిస్తున్న పైలా యువసేన మండల అధ్యక్షుడు గద్రెడ్డి కొండలరావు (జికె) కు పార్టీ అధినేత చంద్రబాబు అభినందన లేఖ అందజేశారని ఆయన తెలిపారు. ప్రతి రోజూ పార్టీకి సంబంధించిన సమాచారాన్ని, రాష్ట్రంలో జరుగుతున్న అన్యాయాలను ప్రజలకు చేరువయ్యేలా యాప్ ద్వారా అవగాహన కల్పిస్తూ, 50వేల పాయింట్లు సాధించడం గర్వించదగ్గ విషయమని, కొండలరావు కృషిని తెలుగుదేశంపార్టీ ఎప్పుడూ గుర్తుపెట్టుకుంటుందని, ఇదే చొరవ చూపిస్తూ ఇక ముందు కూడా యాప్ వినియోగంలో అందరికీ స్ఫూర్తిగా నిలవాలని, మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షిస్తు చంద్రబాబు నుంచి అభినందన లేఖ వచ్చినట్లు జికె తెలిపారు. గొప్ప మార్పు కోసం, అందుబాటులో ఉన్న గొప్ప డిజిటల్ అస్త్రం 'మన టిడిపి' యాప్ ద్వారా పార్టీ కార్యక్రమాలను ప్రజలకు మరింత చేరువ చేస్తానని, యువత ఇందులో భాగస్వామ్యం కావాలని జికె పిలుపునిచ్చారు.

కాలువ కాదిది... వీధి రోడ్డే!



నిండానీరు నిలిచిన తాళ్లపాలెం అఫీషియల్ కాలనీ రోడ్డు

ప్రజాశక్తి- కశింకోట : మండలంలోని బంగారయ్యపేటలో ప్రాథమిక పాఠశాలకు వెళ్లే రహదారి చిన్నపాటి వర్షం కురిసినా రోడ్డుపై భారీగా నీరు నిలిచి కాలువను తలపిస్తోంది. దీంతో స్థానికులతో పాటు పాఠశాలకు వెళ్లే విద్యార్థులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా సిసి రోడ్డు నిర్మాణం చేయాలని స్థానికులు కోరుతున్నారు. అలాగే మండలంలోని తాళ్లపాలెం అఫీషియల్ కాలనీ రోడ్డు మురుగునీరుతో నిత్యం ఉంటుంది. రోడ్డుకు రెండు వైపులా మురుగు కాలువలు లేకపోవడంతో ఈ పరిస్థితి దాపురించింది. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి, ఈ రోడ్డులో నీరు నిల్వ లేకుండా చేయాలంటే ముందుగా డ్రైనేజీ నిర్మాణం చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు

సమగ్ర భూ రీసర్వేతో సరికొత్త చిక్కులు

అఖిలపక్ష రాజకీయ పార్టీల రౌండ్‌టేబుల్ సమావేశంలో నేతలు



సమావేశంలో మాట్లాడుతున్న అఖిలపక్ష నేతలు

ప్రజాశక్తి-అనకాపల్లి : సమగ్ర భూరీసర్వేతో రైతులకు కొత్త సమస్యలు ఎదురౌతున్నాయని వివిధ ప్రజాసంఘాల నాయకులు, రైతు సంఘాల నేతలు అన్నారు. ఆదివారం ప్రజా రాజకీయ వేదిక ఆధ్వర్యంలో కనిశెట్టి సురేష్‌బాబు అధ్యక్షతన ల్యాండ్ రీసర్వే విధానంపై రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కనిశెట్టి సురేష్‌బాబు భూరీసర్వేతో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, తప్పుడు సర్వే రిపోర్టుల వలన ఉత్పన్నమౌతున్న ఇబ్బందులు, రైతుల అభ్యంతరాలపై అధికారుల నిర్లక్ష్య స్పందన తెలియజేశారు. రీసర్వే లోపాలను సరిచేయాలని, సరిచేసిన తర్వాతనే రికార్డుల స్వచ్ఛతకు పూనుకోవాలని సమావేశం తీర్మానించింది. అలాగే సాగులోవున్న విస్తీర్ణం కంటే తగ్గించి సర్వే రిపోర్టులను ఇవ్వటాన్ని తప్పుపట్టారు, పూర్తిస్థాయిలో రీసర్వే సమర్థవంతంగా చేయకుండా భూ రికార్డులను మార్చడం గానీ, హక్కు పత్రాలను విడుదల చేయడం గాని చేస్తే రైతులకు తీవ్ర అన్యాయం చేసిన వారవుతారన్నారు. తద్వారా సరిచేసుకోలేని పరిస్థితులు ఏర్పడతాయని సమావేశం అభిప్రాయపడింది. రీసర్వే తప్పుడు నివేదికల వలన రైతులు కొత్త సమస్యలను తెచ్చుకొని కోర్టుల చుట్టూ తిరిగే పరిస్థితులు నెలకొంటాయన్నారు. తక్షణమే ఉన్న లోపాలను సరిచేసి సమర్థవంతంగా రీసర్వేను చేపట్టాలని కోరారు.కార్యక్రమంలో టిడిపి నాయకులు బొలిశెట్టి శ్రీను, సిపిఐ నేత భద్రం, సిపిఎం నేత బాలకృష్ణ, ఆమ్ ఆద్మీ పార్టీ నేత కొణతాల హరినాథ్‌బాబు, బిజెపి నాయకుడు ఆడారి శరత్‌చంద్ర, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు కర్రి అప్పారావు, రంగారావు, కోరుబిల్లి శంకరరావు, రైతు స్వరాజ్య వేదిక నాయకుడు గాడి బాలు పాల్గొన్నారు.

ముఠా కార్మికులకు సమగ్ర చట్టం చేయాలి



నినాదాలు చేస్తున్న ముఠా కార్మికులు

ప్రజాశక్తి -అచ్యుతాపురం :ముఠా కార్మికులకు సమగ్ర చట్టం చేయాలని ముఠా కార్మికుల సంఘ మండల కార్యదర్శి రాజాన సత్తిబాబు డిమాండ్ చేశారు. ఆదివారం అచ్యుతాపురం సెజ్‌లో ముఠా కార్మికులనుద్దేశించి మాట్లాడుతూ ముఠా కార్మికులకు పని భద్రత, గుర్తింపు కార్డులు, ఇఎస్ఐ పిఎఫ్ ప్రమాద బీమా, పింఛనుతో కూడిన సమగ్ర చట్టం చేయాలని కోరారు. ప్రమాదంలో అనారోగ్యంతో మరణించిన ముఠా కార్మిక కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని, వారిని ఆదుకోవాలని కోరారు. రోజు 12 గంటల విధి నిర్వహణ, బరువులు మోయడం వల్ల చిన్న వయసులోనే వృద్ధాప్యం బారిన పడుతున్నట్లు కుదేలౌతున్నారని ఆవేదన వెలిబుచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ముఠా కార్మికులకు సంక్షేమ బోర్డు సంక్షేమ నిధి ఏర్పాటు చేయాలని కోరారు స్వాతంత్ర దినోత్సవం రోజున గాంధీ విగ్రహాలకు వినతి పత్రాలు అందజేయాలని ముఠా కార్మికులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ముఠా కార్మిక సంఘం నాయకులు రాజు, తాతారావు, వెంకన్న ,వాసు పాల్గొన్నారు.

ప్రజాసమస్యలపై ఒకే ఒక్కడి పోరాటం



రిలే నిరాహారదీక్షలో పాల్గొన్న వెంకటేష్

ప్రజాశక్తి- పరవాడ: మండలంలో దీర్ఘకాలికంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ పరవాడకు చెందిన పోతల వెంకటేష్ ఒకే ఒక్కడు జనసేన జెండా రిలేదీక్షలు చేపడుతున్నాడు. పరవాడ సంతబయలు వద్ద శిబిరాన్ని ఏర్పాటు చేసి పది రోజులుగా దీక్షలను కొనసాగిస్తున్నాడు. పర్యావరణాన్ని కాలుష్య కారకం చేస్తూ, ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్న రాంకీ ఫార్మాసిటీలోని ఫార్మా కంపెనీలపై తగు చర్యలతోపాటు పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ నిరంతర పర్యవేక్షణ చేయాలని, మండల వాసులందరికీ ఆయుష్మాన్ భారత్ హెల్త్ కార్డులు జారీ చేయాలని, ఎన్‌టిపిసి సింహాద్రి, ఫార్మాకంపెనీలలో స్థానికులకు 75శాతం ఉద్యోగావకాశాలు కల్పించాలన్న మూడు ప్రధాన డిమాండ్లతో ఈ రిలేదీక్షలను చేపడుతున్నట్లు వెంకటేష్ తెలిపారు.వీటిపై ప్రభుత్వం, అధికారుల నుంచి స్పష్టమైన పరిష్కారహామీ వచ్చేంత వరకు దీక్షలను కొనసాగిస్తానని స్పష్టం చేశాడు.

మాజీ సైనికులకు సత్కారం

ప్రజాశక్తి - అచ్యుతాపురం : అజాదీ కా అమృతోత్సవ్‌లో భాగంగా మండలంలోని ఉప్పవరంలో నాదేశం నా భూమి కార్యక్రమం నిర్వహించారు. ఎంపిడిఒ విజయలక్ష్మి, సర్పంచ్ సకల ఉమామహేశ్వరి ఆధ్వర్యంలో మాజీ సైనికుడు కూనిశెట్టి రమణను సత్కరించారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకుడు రావి శోభన్ బాబు, ఉపసర్పంచ్ కూనిశెట్టి సత్తిబాబు సచివాలయ కన్వీనర్ చిన్ని శ్రీనివాసరావు, వైసిపి అధ్యక్షులు పందల శ్రీను, ఉపాధ్యక్షులు చిన్ని సత్యారావు పాల్గొన్నారు. ఎర్రవరం గ్రామంలో మాజీ సైనికుడు అప్పారావును సర్పంచ్ గంగిరెడ్డి లక్ష్మి రాము దుశ్శాలువాతో సత్కరించారు.

శ్రమదానంతో కాలువ పూడికతీత

ప్రజాశక్తి-దేవరాపల్లి: కొల్లి వారి కళ్లాల నుంచి జాగరపు వారి కళ్లాల వరకు పంటకాలువలో తుప్పలు, పూడికలను ఆయకట్టు రైతులు శ్రమదానంతో తొలగించారు. ఇప్పటికే రైవాడ నీరు ఆయకట్టుకు పారుతుండగా, పిల్ల కాలువల ద్వారా పంటపొలాలకు నీరందించే కాలువలు పూర్తిగా తుప్పలతో పూడుకుపోయి, నీరు పారని పరిస్థితి ఉండడంతో వాటిని తొలగించేందుకు రైతులు పూనుకున్నారు. ప్రస్తుతం వర్షాభావ పరిస్థితులుండడంతో కాలువల్లో నీరు పారనిస్థితి ఉండడంతో వాటిని తొలగించడానికి నడుం బిగించారు. ఇటీవల బి.కింతాడ, కలిగొట్ల రైతులు కూడా కాలువల్లోనూ పూడిక తీత చేపట్టారు.

సమస్యల పరిష్కారానికి పోరాటం

ప్రజాశక్తి- కె.కోటపాడు : ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతర పోరాటం చేయాలని సిపిఎం మండల నేతలు ఎర్ర దేవుడు, వనము సూర్యనారాయణ అన్నారు. ఆదివారం మండలంలోని వారాడ గ్రామంలో నిర్వహించిన సిపిఎం ఆనందపురం శాఖ సమావేశంలో శాఖ పరిధిలోని అనంతపురం, వారాడ, ఆర్‌వై అగ్రహారం, పోతినవలస, సూరెడ్డిపాలెం గ్రామాలలో సమస్యలను గుర్తించడం, అర్హులైన వారికి సంక్షేమ పథకాల అమలుపై ఆరా, గ్రామాభివృద్ధి ప్రణాళిక తయారీపై సమావేశంలో చర్చించారు.

ప్రస్తుత రాష్ట్రప్రభుత్వం సంక్షేమ పథకాలను కుదిస్తోందని, అర్హులైన వారికి సంక్షేమ పథకాలు అందకపోతే, సంబంధిత అధికారులకు తెలియపరిచి, వాటి పరిష్కారానికి ఉద్యమించడం, పోరాటం చేయాలని సమావేశంలో తీర్మానించారు.కార్యక్రమంలో ఎల్.దేవుడమ్మ పాల్గొన్నారు.

ప్రాణ స్నేహితుడిని కోల్పోయిన ఎంవిఆర్



బ్రిటీష్ రెడ్డి (ఫైల్‌ఫోటో)

ప్రజాశక్తి- అనకాపల్లి : అనకాపల్లికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త, ముత్యాల గ్రూప్ ఆఫ్ ఇండస్ట్రీస్ అధినేత ముత్యాల వెంకటేశ్వరరావు (ఎంవిఆర్) తన వ్యాపార భాగస్వామి, ప్రాణ స్నేహితుడు బ్రిటిష్ రెడ్డిని కోల్పోయారు. ఎంవిఆర్ ప్రాణస్నేహితుడిగానే అందరికీ పరిచయస్తుడైన బ్రిటిష్ రెడ్డి మృతి పట్ల ఎంవిఆర్ ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ,ఘనంగా నివాళు లర్పించారు. తన కుడిభుజాన్ని కోల్పోయానని ఆవేదన వ్యక్తం చేశారు.

ఎంవిఆర్, బ్రిటీష్‌రెడ్డి స్నేహబంధంతోనే వ్యాపార వ్యవహారాలు కొనసాగిస్తూ, ఏమి చేసినా,ఎక్కడికి వెళ్ళినా ఇద్దరూ కలిసిమెలిసి వెళ్తుండేవారు. అటువంటి ప్రాణ స్నేహితున్ని కోల్పోవడాన్ని తానింకా నమ్మలేక పోతున్నానని ఎంవిఆర్ ఆవేదన వ్యక్తం చేస్తూ, వారి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. బ్రిటీష్ రెడ్డి ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు.

పీలా కప్ క్రికెట్ టోర్నీ ప్రారంభం



టోర్నీని ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే పీలా

ప్రజాశక్తి - కశింకోట : ఈ నెల 18న మాజీ ఎమ్మెల్యే, టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పీలా గోవింద సత్యనారాయణ జన్మదినం సందర్భంగా కశింకోట గ్రామ తెలుగుదేశం కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పీలా కప్ క్రికెట్ టోర్నీని ఆదివారం పీలా గోవింద ప్రారంభించారు. ఈ టోర్నీలో అనకాపల్లి, కశింకోట మండలాలకు చెందిన 12జట్లు పాల్గొంటున్నాయని, విజేతలకు జ్ఞాపికతోపాటు నగదు బహుమతులు అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు.కార్యక్రమంలో పార్టీ నాయకులు కాయల మురళి, ఉగ్గిన రమణ మూర్తి, వేగి గోపీకృష్ణ, సిద్దిరెడ్డి శ్రీనివాసరావు, నైనంశెట్టి రమణారావు కాండ్రేగుల సతీష్ కుమార్, ఆడారి నర్సింగరావు, వేగి సాయి, సిద్దిరెడ్డి సూర్యనారాయణ, తాతారావు, షేక్ బాబర్, కలగా సోమేశ్వరరావు పాల్గొన్నారు.

'లారీ ఓనర్స్' నూతన కార్యవర్గం

ప్రజాశక్తి -అచ్యుతాపురం :లారీ ఓనర్స్ అసోసియేషన్ కార్యవర్గం అవకతవకలకు పాల్పడితే సహించేది లేదని ఎలమంచిలి ఎమ్మెల్యే కన్నబాబురాజు హెచ్చరించారు. ఆదివారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో శ్రీ కనకదుర్గ లారీ అసోసియేషన్ కార్యవర్గ సమావేశం నిర్వహించారు.నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, పరిశ్రమల యాజమాన్యాలను సంప్రదించి అందరికీ న్యాయం జరిగేలా చూడాలని నూతన కార్యవర్గానికి సూచించారు. లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షులుగా ఆడిగరల దేవుడు, ప్రగడ ప్రకాష్ ఎన్నుకున్నారు. కార్యక్రమంలో డిసిసిబి మాజీ ఛైర్మన్ సుకుమార వర్మ,వైసిపి మండల శాఖ అధ్యక్షులు దేశం శెట్టి శంకరరావు, పిల్ల సతీష్, గొర్లి నూకరాజు, రెడ్డి శ్రీనివాసరావు, లాలం వాసు, పిన్నమరాజు రాజు, కెకె. రమేష్ బాబు, కె.వి రమణ పాల్గొన్నారు.

వికలాంగుల సంక్షేమమే లక్ష్యం



వికలాంగులకు త్రీవీలర్‌బైక్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

ప్రజాశక్తి- ఎలమంచిలి: వికలాంగుల సంక్షేమమే లక్ష్యంగా వైసిపి ప్రభుత్వం పనిచేస్తోందని ఎలమంచిలి ఎమ్మెల్యే కన్నబాబురాజు అన్నారు. ఆదివారం అచ్యుతాపురం మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో అర్హులైన వికలాంగ లబ్ధిదారులకు మూడు చక్రాల వాహనాలను ఎమ్మెల్యే కన్నబాబురాజు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, వికలాంగులకు మూడు చక్రాల వాహనాల కోసం 15మంది దరఖాస్తు చేసుకోగా, వారిలో ఇద్దరు అనర్హులని, మిగిలిన 13మందిలో తొలివిడతలో 10మందికి మోటారు ట్రైసైకిళ్లను అందజేశారు. మిగిలిన ముగ్గురికి త్వరలో అందజేస్తామన్నారు. కార్యక్రమంలో డిసిసిబి మాజీ ఛైర్మన్ యు సుకుమార్‌వర్మ, ఎంపిడిఒ విజయలక్ష్మి, మండల పరిషత్ పరిపాలన అధికారి డి కృష్ణ, వికలాంగుల సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ జివిబి.జగదీష్, కోన సంధ్య లచ్చన్నాయుడు, వైసిపి మండల శాఖ అధ్యక్షులు దేశెట్టి శంకరరావు, కె విమలానాయుడు, మునగపాక ఎంపిపి మళ్ల జయలక్ష్మి, ఎస్ఐ సన్యాసినాయుడు పాల్గొన్నారు.

డైట్‌లో ప్రాంగణ నియామకాలు

ప్రజాశక్తి-అనకాపల్లి : స్థానిక డైట్ ఇంజనీరింగ్ కళాశాలలో ఆదివారం టెక్నిక్స్ ఇంటిగ్రేషన్ టెక్నాలజీస్ కంపెనీ ప్రాంగణ నియామకాలు చేపట్టింది. డైట్ కళాశాల విద్యార్థులకు టెక్నిక్స్ ఇంటిగ్రేషన్ టెక్నాలజీస్ కంపెనీకి చెందిన ట్రైనింగ్ హెడ్ పి.రవి కుమార్, శ్రీనివాస్ ఇంటర్వ్యూ నిర్వహించారు. డైట్ కళాశాలకు చెందిన 88 మంది విద్యార్థులు పాల్గొనగా, 35 మంది రాత పరీక్షల్లో, తదుపరి టెక్నికల్ ఇంటర్వ్యూలో 22 మంది ఎంపికై, హెచ్ఆర్ ఇంటర్వ్యూకు అర్హత సాధించారు. ఆన్‌లైన్‌లో హెచ్ఆర్ ఇంటర్వ్యూ నిర్వహించి, అర్హులను ఎంపిక చేస్తామని టెక్నిక్స్ ఇంటిగ్రేషన్ టెక్నాలజీస్ కంపెనీ ట్రైనింగ్ హెడ్ పి.రవికుమార్ తెలిపారు.

ఈ సందర్భంగా కళాశాల ఛైర్మన్ దాడి రత్నాకర్ మాట్లాడుతూ డైట్‌లో పలు సాఫ్ట్‌వేర్ కంపెనీలు ఎంప్యానెల్ చేసుకున్నారని, తద్వారా విద్యార్థులకు మరిన్ని క్యాంపస్ ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు. ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్ వైకుంఠరావు మాట్లాడుతూ మల్టీ నేషనల్ కంపెనీల్లో ఒకటైన టెక్నిక్స్ ఇంటిగ్రేషన్ టెక్నాలజీస్ కంపెనీలో విద్యార్థులు ప్రతిభ కనబరచాలని ప్రోత్సహించారు. అకడమిక్ డీన్ డాక్టర్ కె.పార్వతి మాట్లాడుతూ డైట్‌లో ప్రాంగణ నియామకాలకు పెద్ద పీట వేశారని,విద్యార్థులందరూ ఉపయోగించుకోవాలని కోరారు. ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ వై హేమంత్ కుమార్ మాట్లాడుతూ డైట్ విద్యార్థులకు బిటెక్ మూడవ ఏటనే క్యాంపస్ రిక్రూట్‌మెంట్ శిక్షణనిచ్చి, ఇంటర్వ్యూలకు సిద్ధం చేస్తున్నామన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం అందజేత

ప్రజాశక్తి - పరవాడ: మండలంలోని నాయుడుపాలెం గ్రామపంచాయతీ గొల్లపేట గ్రామంలో శ్రీ కృష్ణ ఆలయ నిర్మాణానికి ఆదివారం జిల్లా పరిషత్ స్టాండింగ్ కమిటీ సభ్యులు, పరవాడ జెడ్‌పిటిసి పైలా సన్యాసిరాజు రూ.10 వేలను తమ వంతు సాయంగా అందజేశారు. ఆలయ కమిటీ పెద్దలకు విరాళ మొత్తాన్ని అందజేశారు. నాయుడుపాలెం పంచాయతీ సర్పంచ్ కూండ్రపు వరలక్ష్మి సీతారామయ్య, గొర్లివానిపాలెం ఇన్‌ఛార్జి సర్పంచ్ గొర్లి గోపి, వైసిపి యువనేత బండారు శ్రావణ్ కుమార్, 11వ వార్డు సభ్యుడు సారిపల్లి సోము నాయుడు, సారిపల్లి అశోక్, ఉప్పుల నర్సింగరావు, గొలగాని నరేష్ పాల్గొన్నారు



విరాళాన్ని అందజేస్తున్న సన్యాసిరాజు

చోడవరం సుగర్స్ నిధులు మంజూరుకు కృషి

గడపగడపకూ ముగింపు సమావేశంలో వైసిపి ఉత్తరాంధ్ర రీజనల్ కోఆర్డినేటర్ సుబ్బారెడ్డి

ప్రజాశక్తి- చోడవరం : చోడవరం సుగర్స్‌కు తక్షణసాయంగా అవసరమైన నిధులతోపాటు స్థానిక ఎమ్మెల్యే ధర్మశ్రీ కోరిక మేరకు రూ.10.50కోట్లు మంజూరుకు కృషి చేస్తానని వైసిపి ఉత్తరాంధ్ర రీజనల్ కోఆర్డినేటర్ వైవి.సుబ్బారెడ్డి స్పష్టంచేశారు. ఆదివారం చోడవరం నియోజకవర్గంలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం పూర్తయిన సందర్భంగా ఎమ్మెల్యే ధర్మశ్రీ అధ్యక్షతన స్థానిక డిగ్రీ కాలేజీ మైదానంలో నిర్వహించిన బహిరంగసభలో మాట్లాడుతూ, వచ్చే జనవరి నుంచి సామాజిక పింఛను రూ.మూడు వేలు అందిస్తామన్నారు. అనకాపల్లి నర్సీపట్నం రోడ్డుకు రూ.120 కోట్లు నిధులు మంజూరైనా, కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వల్ల పనుల్లో జాప్యం జరుగుతోందన్నారు. ఆగస్టు నెలలో పనులు చేపట్టి, మూడు నెలల్లో పూర్తిచేస్తామన్నారు. ఉత్తరాంధ్ర సృజల స్రవంతి పనులు వేగవంతానికి చర్యలు తీసుకుంటామన్నారు. రానున్న ఎన్నికల్లోనూ చోడవరం నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా ధర్మశ్రీయే మళ్లీపోటీలో ఉంటారని, ప్రజలు ఆదరించి గెలిపించాలని కోరారు.



బహిరంగ సభలో మాట్లాడుతున్న వైవి సుబ్బారెడ్డి

ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు మాట్లాడుతూ, రాష్ట్రంలో ఏ నియోజకవర్గానికి లేనివిధంగా చోడవరానికి రూ.150కోట్ల జలజీవన్ మిషన్ నిధులు మంజూరయ్యాయన్నారు. ఐటి మంత్రి గుడివాడ అమర్‌నాథ్ మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వంపై మోడీకి చెబుతానంటూ .చిన్నపిల్లాడిలా మాట్లాడు తున్నారని, ఎవరికి చెప్పుకున్నా జగన్మోహన్ రెడ్డి భయపడే వ్యక్తి కాదన్నారు. అనకాపల్లి ఎంపి డాక్టర్ బివి.సత్యవతి మాట్లాడుతూ, సంక్షేమ లబ్ధిని నేరుగా లబ్ధిదారుల ఖాతాలకు జమచేసేలా పథకాలను అమలుచేసిన ఘనత ఒక్కవైసిపికే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో జెడ్‌పి ఛైర్‌పర్సన్ జల్లి సుభద్ర, ఎలమంచిలి ఎమ్మెల్యే కన్నబాబురాజు, డిసిఎంఎస్ ఛైర్మన్ కోలా గురువులు, నియోజకవర్గ పరిశీలకులు చొక్కాకుల వెంకటరావు, డిసిసిబి ఛైర్మన్ పల్లా నర్సింగరావు, మార్కెట్ కమిటీ ఛైర్మన్ ఏడువాక సత్యారావు, జెడ్‌పిటిసిలు దొండ రాంబాబు, శ్రీను, తలారి మూర్తి, ఎంపిపి గాడి కాసు, స్థానిక సర్పంచ్ బండి నూకాలమ్మ పాల్గొన్నారు. బహిరంగ సభకు భారీ ఎత్తున మహిళలతోపాటు ప్రజలు తరలిరావడంతో సభాప్రాంగణం కిక్కిరిసిపోయి, వేదిక నలువైపులా జనం నిలబడి సభను తిలకించారు. సభను విజయవంతం చేసిన ప్రజలు, కేడర్‌కు ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ కృతజ్ఞతలు తెలిపారు.

అర్హులందరికీ ఇళ్ల స్థలాలు

గడపగడపలో మంత్రి గుడివాడ అమర్‌నాథ్




అప్పలనాయుడును పరామర్శిస్తున్న మంత్రి అమర్

ప్రజాశక్తి- అనకాపల్లి : అర్హులైన వారందరికీ ఇళ్ల స్థలాలు మంజూరు చేస్తామని రాష్ట్ర మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. ఆదివారం మండలంలోని సంపతిపురం గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎస్‌సి కాలనీలో రూ.10.30 లక్షల వ్యయంతో నిర్మించిన 20 కిలోలీటర్ల ఓవర్ హెడ్ ట్యాంక్‌ను మంత్రి ప్రారంభించారు. రెండేళ్ల కిందట బస్సుప్రమాదంలో తీవ్రంగా గాయపడి, శరీరం చచ్చుబడి మంచానికే పరిమితమైన దాకారపు అప్పలనాయుడును, అతని కుటుంబాన్ని పరామర్శించారు. ఇప్పటికే రూ.18 లక్షలు ఖర్చు చేశామని, ఇక వైద్యానికి తమ వద్ద ఆర్థిక స్తోమత లేదని, ప్రభుత్వ పరంగా ఆదుకోవాలని బాధిత కుటుంబీకులు మంత్రి అమర్‌కు విన్నవించారు. దీనిపై మంత్రి స్పందిస్తూ, అప్పలనాయుడు వైద్యానికి చేసిన ఖర్చుల వివరాలను ఇవ్వాలని, ప్రభుత్వంతో మాట్లాడి ఆర్థిక సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. వైసిపి రాష్ట్ర కార్యదర్శి దిలీప్‌కుమార్, ఎంపిపి సూరిబాబు, మండల పార్టీ అధ్యక్షుడు పెద్ది శెట్టి గోవింద, ఆడారి సూరప్పారావు, వైసిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

బ్రిటీషర్లను తలపిస్తోన్న జగన్‌రెడ్డి పాలన

ప్రజాశక్తి-అనకాపల్లి : జగన్‌రెడ్డి నేతృత్వంలో రాష్ట్రంలో వైసిపి పాలన బ్రిటీషర్లను తలపిస్తోందనిమాజీ ఎమ్మెల్యే, టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పీలా గోవింద సత్యనారాయణ అన్నారు. టిడిపి అధికారంలోకి రాగానే మహిళలకు ఆదరణ పథకాన్ని పునరుద్ధరిస్తామన్నారు. ఆదివారం జివిఎంసి 83వ వార్డు లక్ష్మీదేవిపేటలో మహాశక్తి పథకం ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టిడిపితోనే మహిళలందరి ఆర్థికాభివృద్ధి సాధ్యమన్నారు. బటన్ నొక్కడమే తప్ప, అనేకమందికి లబ్ధిదారులకు సంక్షేమ రాయితీ అందని పరిస్థితి ఉంటోందని, దీనికి ఇటీవల విడుదల చేసిన అమ్మఒడి నిదర్శనమన్నారు..83వ వార్డు ఇన్‌ఛార్జి బొద్దపు ప్రసాద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వార్డు ఉపాధ్యక్షులు కర్రి గోపి, కొణతాల రత్నకుమారి, కాండ్రేగుల ముకుంద,దొడ్డి రాము, పరవాడ సురేష్,కాయల ప్రసన్న లక్ష్మి, కొట్ని ఉమా, భీశెట్టి హేమ, కూరాకుల భారతి,



మహాశక్తి ప్రచారంలో మాజీ ఎమ్మెల్యే పీలా

కాళ్ళ రామ్ ప్రసాద్,కొణతాల గణేష్, కాళ్ళ రవి కుమార్,కొణతాల నూకరాజు,నూరే సతీశ్,కొణతాల వాసు,తలారి లక్ష్మి ప్రసాద్, లక్కోజు శ్రీను, మళ్ళ శివనారాయణ, కొమ్మనాపల్లి వాసు దేవరావు, గంపల శ్రీను, కొయ్యి నారాయణ, దొడ్డి కనక, కొణతాల అప్పలనర్సమ్మ,కొణతాల దేవకి పాల్గొన్నారు.

ఉచిత నేత్ర వైద్యశిబిరానికి స్పందన

ప్రజాశక్తి- మునగపాక రూరల్: మండలంలోని వాడ్రాపల్లి గ్రామంలో ఆదివారం నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు ఆధ్వర్యంలో అనకాపల్లి భువనేశ్వరి నేత్రవైద్యులు గంగుపాం నాగేశ్వరరావు, గార్లపాటి వెంకటేశ్వరరావు పాల్గొని రోగులకు కంటి పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులను అందజేశారు. కార్యక్రమంలో గ్రామ సచివాలయ కన్వీనర్ పెతకంశెట్టి రామ జోగి నాయుడు, మళ్ల మల్లయ్య నాయుడు, మళ్ల జోగారావు పాల్గొన్నారు.

రోగులకు పండ్లు, రొట్టెల పంపిణీ

ప్రజాశక్తి-అనకాపల్లి : మండల తెలుగు యువత ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే, టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ పీల గోవింద సత్యనారాయణ జన్మదిన వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగాఆదివారం ఎన్‌టిఆర్ ఆసుపత్రిలో రోగులకు, గర్భిణులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. టిడిపి బీసీ సాధికారత సమితి రాష్ట్ర కన్వీనర్ మళ్ళ సురేంద్ర, 83వ వార్డు ఇన్‌ఛార్జ్ బొద్దపు ప్రసాద్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 18న మాజీ ఎమ్మెల్యే పీలా జన్మదినం సందర్భంగా పలు కార్యక్రమాలను చేపడుతున్నామన్నారు. ఎన్‌టిఆర్ జిల్లా ఆసుపత్రిని అభివృద్ధి చేసిన ఘనత మాజీ ఎమ్మెల్యే పీలా గోవిందకే దక్కుతుందన్నారు.రూ.13కోట్లతో మాతా, శిశు భవనాన్ని నిర్మించారన్నారు. కార్యక్రమంలో తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షుడు సందిన సునీల్, ప్రధాన కార్యదర్శి కరణం పవన్, మండలఅధ్యక్షుడు మరువరెడ్డి సత్యనారాయణ(ఎంఎస్ఎన్), మండల ప్రధాన కార్యదర్శి చందక నర్సింగరావు రావు, మండల ఉపాధ్యక్షులు కొట్ని సురేష్, జోగా భాను, కమిటీ సభ్యులు సిరసపల్లి రమేష్, పెంటకోట హరి, భోదా గోవింద, సియ్యాద్రి శ్రీను, రాయి శ్రీను, వరదా కృష్ణ, రొంగళి సుధీర్ పాల్గొన్నారు.

రైల్వే సమస్యలపై ఎంపికి వినతి



ఎంపి సత్యవతికి వినతిపత్రం ఇస్తున్న ఎలమంచిలివాసులు

ప్రజాశక్తి - యలమంచిలి : రామనగర్ రైల్వే గేటు వద్ద అండర్ పాస్‌వే నిర్మించాలని పట్టణానికి చెందిన పలువురు ఎంపీ డాక్టర్ బివి.సత్యవతిని కోరారు. ఎంపి క్యాంపు కార్యాలయంలో కలిసి పలు రైల్వే సమస్యలపై వినతి పత్రం సమర్పించారు.ఎలమంచిలి రైల్వే స్టేషన్లో సౌకర్యాలు మెరుగుపరచడం లేదని, రత్నాచల్, కాచిగూడ, ప్రశాంతి, గరీబ్‌రథ్ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు యలమంచిలిలో హాల్ట్ ఇవ్వాలని, రైల్వేస్టేషన్‌లో డిజిటల్ బోర్డులు ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో రిటైర్డ్ లెక్చరర్ పూరీ జగన్నాథ్, పెన్షనర్ల సంఘం అధ్యక్షులు సోమేశ్వరరావు, వీసం గోవింద్, రిటైర్డ్ సిఐ నాగరాజు, సూరిబాబు, నాగేశ్వరరావు, గోవింద్, రమణ, వెంకటేశ్వరరావు, ఆర్‌పిఎఫ్ రాజు పాల్గొన్నారు.

శ్రమదానంతో స్పీడ్ బ్రేకర్ల ఏర్పాటు

ప్రజాశక్తి- సబ్బవరం: మండలంలోని ఆనందపురం-అనకాపల్లి16వ నెంబర్ జాతీయ రహదారిపై బంజరి జంక్షన్ వద్ద శ్రమదానంతో స్పీడ్‌బ్రేకర్లను ఏర్పాటు చేశారు. లే బై రోడ్డులో తరచూ ప్రమాదాలు జరగడం, ఇటీవల ఒక వ్యక్తి మరణించడంతో గ్రామ సర్పంచ్ మామిడి శంకరరావు సమస్యను జాతీయ రహదారి కాంట్రాక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. దీనితో కాంట్రాక్టర్ స్పీడ్‌బ్రేకర్ల నిర్మాణానికి మెటీరియల్ సమకూర్చగా, గ్రామానికి చెందిన తెలుగు యువత అధ్యక్షులు ఆకుల నాగేశ్వరరావు, బాటజంగాల పాలెం సర్పంచ్ పడాల వెంకటరమణ ఆధ్వర్యంలో నారపాడు గ్రామస్తుల శ్రమదానంతో స్పీడ్‌బ్రేకర్లను నిర్మించారు.నారపాడు గ్రామస్తులు కొట్ని తాతారావు, సాడి అప్పారావు, వర్మరాజు, ఆకుల సురేష్, బలిరెడ్డి గంగరాజు, వేపాడ అప్పారావు పాల్గొన్నారు.

గంజాయి మత్తులో యువత వీరంగంపై ఫిర్యాదు

ప్రజాశక్తి - దేవరాపల్లి : మండల కేంద్రంలో గంజాయి మత్తులో కొందరు యువకులు నానా ఇబ్బందులకు గురిచేస్తున్నారని దేవరాపల్లి గ్రామస్తులు శనివారం రాత్రి స్థానిక పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు. సీసాల్లో లిక్విడ్ గంజాయిని పట్టుకుని, దాన్ని పైపుల ద్వారా పీల్చుతూ, మత్తెక్కిన తర్వాత వీధుల్లో వీరంగం చేస్తున్నారని వాపోయారు. నలుగురైదుగురు యువకులు గుంపుగా వాహనాల్లో పెట్రోల్ దొంగతనం, షట్టర్లు పగలగొట్టి షాపుల్లో చోరీ వంటి దుశ్చర్యలకు పాల్పడుతున్నారని విన్నవించారు. ఇటీవల కాంప్లెక్స్‌లో గిరిజన మహిళ బ్యాగులు ఎత్తుకెళ్లే ప్రయత్నం చేయగా, అడ్డుకున్న ఆమె భర్తను రాళ్లతో గాయపరిచారని, శారదా నది ఒడ్డున కొబ్బరి తోట వద్ద ఆటోను అడ్డగించి దౌర్జన్యం చేయబోతుంటే, దగ్గరలో ఉన్న స్నేహితులకు ఫోన్ చేయడంతో వారు వచ్చేసరికి పరారయ్యారయ్యారని ఫిర్యాదు చేశారు. సిఐ తాతారావు స్పందిస్తూ యువకుల కుటుంబ సభ్యులను పిలిపించి, కౌన్సెలింగ్ ఇచ్చామని, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు.

సమాజానికి విజ్ఞానం.. జెవివి సంకల్పం

- జన విజ్ఞాన వేదిక రాష్ట్ర సాహిత్య విభాగం కన్వీనర్ యలమంద-జెవివి జిల్లా మహాసభలో పలు అంశాలపై తీర్మానం



మాట్లాడుతున్న యలమంద

ప్రజాశక్తి-మాడుగుల:శాస్త్రీయ దృక్పథం ప్రపంచ వ్యాప్తం కావాలని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర సాహిత్య విభాగం కన్వీనర్ జే.యలమంద అన్నారు. మాడుగుల విశాఖ డెయిరీ పాల కేంద్రం వద్ద ఆదివారం జన విజ్ఞాన వేదిక జిల్లా మహాసభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సైన్స్‌లో వున్న యదార్థం గమనించాలన్నారు. సమాజానికి విజ్ఞానాన్ని అందించడం కోసం జెవివి ఏర్పడిందని తెలిపారు.జెవివి రాష్ట్ర ఉపాధ్యక్షులు త్రిమూర్తులురెడ్డి మాట్లాడుతూ, జెవివి నాస్తిక సంఘం కాదని, కేవలం సైన్స్, పర్యావరణం వంటి విషయాల కోసం పని చేస్తుందని తెలిపారు.విద్యార్థులకు సైన్స్ పట్ల ఆసక్తి, విజ్ఞానం కలిగించడం కోసం పని చేస్తుందని అన్నారు. ఎంపిపి పెదబాబు మాట్లాడుతూ, భవిష్యత్‌లో జన విజ్ఞాన వేదికకు సహాయ, సహకారాలు అందిస్తామని తెలిపారు. మాజీ సర్పంచ్ దంగేటి సూర్యారావు మాట్లాడుతూ, సమాజంలో అనాదిగా సతీసహగమనం, కన్యాశుల్కం, వరకట్నం వంటి దురాచారాలు ఉన్నాయని, వీటిపై జెవివి పలు కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని కొనియాడారు. వైస్ సర్పంచ్ శ్రీనాథ్ శ్రీనివాసరావు మాట్లాడుతూ, జెవివి చేపడుతుతున్న కార్యక్రమాలను అభినందించారు. ఈ కార్యక్రమంలో జెవివి జిల్లా ఉపాధ్యక్షులు ఎంవి అప్పారావు, కార్యదర్శి రామ్ కుమార్, స్థానిక న్యాయవాది శ్రీనాథు ప్రసాదరావు, డిగ్రీ కళాశాల అధ్యాపకులు రామ్ కుమార్, మాడుగుల డివిజన్ కమిటీ అధ్యక్షులు సురేష్ శాంతో, ప్రధాన కార్యదర్శి తాలపు రెడ్డి నాగచంద్ర, కార్యదర్శి గౌరీపట్టపు మహేష్ కుమార్, ఉపాధ్యక్షులు జాగాని ఈశ్వరరావు, కోశాధికారి గొట్టాపు చిన్నం నాయుడు పాల్గొన్నారు

పర్యావరణాన్ని పరిరక్షించుకుందాం

మాడుగుల:పర్యావరణ పరిరక్షణ కోసం జన విజ్ఞాన వేదిక సభ్యులు కృషి చేయాలని ఆదివారం మాడుగులలో జరిగిన జెవివి జిల్లా మహా సభలో తీర్మానం చేశారు. జిల్లా కార్యదర్శి రామ్ కుమార్ కార్యదర్శి నివేదిక

కొత్త జిల్లా కమిటీ ఎన్నిక

అనంతరం జెవివి జిల్లా కొత్త కమిటీ ఎన్నిక జరిగింది. మాడుగులకు చెందిన తాలపురెడ్డి నాగచంద్ర జిల్లా అధ్యక్షులుగానూ, గౌరీపట్నం మహేష్ కుమార్ జిల్లా కార్యదర్శిగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా వి.రామ్‌కుమార్, ఆనందరావు, అంజలి, ప్రధాన కార్యదర్శిగా కె.వరప్రసాద్, కార్యదర్శిగా డి.రాము, మారిశెట్టి వెంకట అప్పారావు, కోశాధికారిగా ఉమామహేశ్వరరావు, సభ్యులుగా రమేష్, శ్యామల, అపర్ణ దేవి, అరవింద్, మూర్తి, వర్మ, జీకే స్వామి, బి.జ్యోతి, మురళీకష్ణ ఎంపిక అయ్యారు.

అనంతరం రాష్ట్ర ఉపాధ్యక్షులు త్రిమూర్తులురెడ్డి తీర్మానం ప్రవేశ పెట్టారు. విద్యా రంగంలో కొన్ని పాఠాలు తొలగింపుపై అభ్యంతరం తెలుపుతూ ఏక వ్యాఖ్య తీర్మానం ప్రవేశ పెట్టగా సభ్యులు తీర్మానించారు. ఈ సభలో జిల్లా ఉపాధ్యక్షులు మారిశెట్టి వెంకట అప్పారావు, మాడుగుల డివిజన్ కమిటీ అధ్యక్షులు సురేష్ శాం తో, ప్రధాన కార్యదర్శి తాళ్లపురెడ్డి నాగచంద్ర, కార్యదర్శి గౌరీపట్నం మహేష్ కుమార్, ఉపాధ్యక్షులు జాగాని ఈశ్వరరావు, కోశాధికారి గొట్టాపు చిన్ననాయుడు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో భారీ చోరీలు

-రాత్రి సమయంలో డీజిల్ చౌర్యం- కేసులు నమోదు చేయని పోలీసులు

ప్రజాశక్తి-మాడుగుల:కొద్ది కాలంగా పలు గ్రామాలలో దొంగలు రెచ్చి పోతున్నారు. వందలు, వేలు కాదు. లక్షలాది రూపాయల చోరీకి పాల్పడుతున్నారు. ట్రాక్టర్లు, జేసిబిలు, 70,80 మిషన్ల వద్ద నుండి రాత్రి సమయాలలో డీజిల్ చౌర్యానికి పాల్పడుతున్నారు. వివిధ రహదారులు, ఇతర పనుల నిమిత్తం ఉదయం నుండి సాయంత్రం వరకు పనులు చేసి రాత్రి సమయంలో డ్రైవర్లు, యజమానులు ఇళ్లకు చేరుతున్నారు. అర్థరాత్రి సమయంలో సదరు దొంగలు యంత్రాల వద్దకు చేరి డీజిల్ పైపులను కోసి, డీజిల్ ఎత్తుకు పోతున్నారు. కొంత కాలంగా జరుగుతున్న ఈ దోపిడీలో కొన్ని లక్షలు విలువైన ఇందనం చోరీ జరిగింది. దీనిపై సదరు యంత్రాల యజమానులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా ఇప్పటి వరకు చర్యలు లేవు.
కింతలి నుండి ఘాట్ రోడ్ జంక్షన్ వరకు రహదారి నిర్మాణం జరుగుతుండగా, ఒక పెద్ద రాజకీయ నేత, అధికార పార్టీకి చెందిన ప్రముఖ నాయకుడి యంత్రాలను సైతం ఈ దొంగలు వదలి పెట్టలేదు. ఈ చోరీలకు పాల్పడిన వారిని గుర్తించినప్పటికీ కొందరు నేతలు వీరిని కాపాడేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నట్టు సమాచారం. మొదటి తప్పు కింద వదలి పెట్ట మని, చోరీకి పాల్పడిన యువకుల గ్రామానికి చెందిన నేతలు పోలీసులపై, ఫిర్యాదు దారులపై ఒత్తిడి తెస్తున్నట్లు సమాచారం. దొంగల వద్ద నుండి 10 లక్షలు వసూలు చేసేందుకు ముమ్మర ప్రయత్నాలు జరుగుతున్నాయి. కానీ, నష్ట పోయిన వారికి మాత్రం ఒక్క రూపాయి కూడా ఇస్తామని చెప్పక పోవడం విశేషం.ఈ నేపథ్యంలో బడా నేత వైఖరి ఇప్పటివరకు స్పష్టంగా తెలియడం లేదు.పోలీసులు కూడా ఇప్పటి వరకు కేసు నమోదు చేయకపోవడం పలు అనుమానాలు రేకిస్తున్నాయి. బాధితుల్లో కొందరు అధికార పార్టీ వారు సైతం ఉన్నారు. రాత్రి సమయాలలో పైపులు కట్ చేసి కావలసినంత డీజిల్ క్యాన్‌లలో నింపుకుని పట్టుకు పోగా, మిగిలిన ఆయిల్ వృథాగా పోతుందని బాధితులు లబో దిబొ మని గగ్గోలు పెడుతున్నారు.


కట్ చేసిన పైపు

వర్షంతో చల్లబడిన వాతావరణం

ప్రజాశక్తి-గొలుగొండ:అకాల వర్షంతో వాతా వరణం చల్లబడింది. మండలంలోని కృష్ణదేవిపేట, లింగంపేట, చోద్యం, అమ్మపేట, గొలుగొండ తదితర గ్రామాల్లో ఉదయం నుంచి భానుడు తన ప్రతాపాన్ని చూపాడు. ఈ నేపథ్యంలో మధ్యాహ్నం ఒక్కసారిగా వాతావరణం చల్లబడి ఈదురు గాలులతో వర్షం కురిసింది. దీంతో గత పది రోజులుగా ఎండతో ఇబ్బందులు పడుతున్న ప్రజలకు ఈ వర్షం ఉపశమనం కలిగించింది. వరి నాట్లకు ఉపయోగ పడుతుందని రైతులు హర్షం వ్యక్తం చేశారు.

బాలుని అదృశ్యం

చదవలేదని మందలించడంతో వెళ్లిన పోయిన వైనం

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్:మండలంలో ధర్మ సాగరం గ్రామానికి చెందిన చుక్కల అప్పలరాజు కుమారుడు జశ్వంత్ ఈనెల 12న అదృశ్యమైనట్లు రూరల్ పోలీస్ స్టేషన్లో కుటుంబీకులు ఫిర్యాదు చేశారు. బాధిత అప్పలరాజు తెలిపిన వివరాలు ప్రకారం.. పాత బస్టాండ్‌లో తన బట్టల షాపు వద్దకు 12న జస్వంత్ వచ్చాడని, సరిగ్గా చదవ లేదని మందలించడంతో రాత్రి 8 సమయంలో బయటికి వెళ్ళాడు.తాను పని పూర్తి చేసుకుని ఇంటికి వెళ్లాను. జస్వంత్ ఇంటికి రాక పోవడంతో కుటుంబీకులు గాలించిన ఆచూకీ లభ్యం కాకోపవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు తన కుమారుడు ఆచూకీ తెలిస్తే ఫోన్: 8985373069కు తెలియ జేయాలని విజ్ఞప్తి చేశారు.



హైస్కూల్ విద్యార్థులకు శిక్షణ

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలో కృష్ణదేవిపేట జెడ్పీ హైస్కూల్ విద్యార్థులకు ఉదయం, సాయంత్రం వేళల్లో గంట పాటు వివిధ అంశాలపై ఏఆర్ ఏఎస్సై నూకరాజు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. తన విధులు ముగించుకొని ఆసక్తి గల విద్యార్థులకు ఆర్మీ, నేవీ, ఎయిర్‌పోర్సు వంటి రంగాల్లో ఉద్యోగాలు పొందేందుకు అవసరమైన శిక్షణను ఉచితంగా అందిస్తున్నారు. ఈ రంగాలకు సంబంధిచి మెలకులను నేర్పిస్తున్నారు. దీంత విద్యార్థులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.


విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న ఎఎస్‌ఐ

నాలుగేళ్లు దాటినా...

నెరవేరని ఎమ్మెల్యే ధర్మశ్రీ హామీలు

- నిర్మించని వంతెన, రోడ్డు

ప్రజాశక్తి-రోలుగుంట:నాలుగేళ్లు అయినా తమకు ఇచ్చిన హామీని ఎమ్మెల్యే ధర్మశ్రీ నెరవేర్చలేకపోయారని రోలుగుంట మండలం గుండుబాడు పంచాయతీ గ్రామాలైన గుర్రాలపాలెం, కశిరెడ్డిపాలెం, బల్జిపాలెం గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా గుర్రాల పాలెంలో గ్రామా నికి ఆనుకొని పెద్దగెడ్డ ఉంది. ఈ గెడ్డ అవతల సుమారు 20 కుటుంబాల వారు జీవిస్తున్నారు. వీరు 18 ఇళ్లు నిర్మించుకున్నారు. వర్షం వస్తే గ్రామానికి రావాలంటే భయం భయంగా ఉంటుం దని వారు వాపోతున్నారు. ఏ అవసరం వచ్చినా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని అంటున్నారు. 2019 ఎన్నికల ముందు చోడవరం ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ వచ్చి తాను గెలిచిన వెంటనే ఈ గ్రామానికి పెద్దగెడ్డ వంతెన నిర్మిస్తానని, గెడ్డ కట్టుకు వెళ్లటానికి, పసరమారమ్మ గుడికి వెళ్లటానికి రహదారి కూడా ఏర్పాటు చేయిస్తానని హామీ ఇచ్చారని, నాలుగేళ్లు దాటినా హామీ నెరవేర్చలేదన్నారు. ఎమ్మెల్యే గెలుపుకు కృషి చేశామని, ఎంపిటిసి, సర్పంచ్ కూడా ఎక్కువ మెజార్టీతో గెలిపించామన్నారు. ఇప్పటికైనా నాయకులు స్పందించి పెద్దగెడ్డ వంతెన, గెడ్డ కట్టు రహదారికి నిధులు మంజూరు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.


వంతెన నిర్మించాల్సిన ప్రాంతం ఇదే..

గడువులోపు ఓటర్ వెరిఫికేషన్ పూర్తి

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్: ఓటర్ వెరిఫికేషన్ ప్రక్రియను గడువు లోపు పూర్తి చేస్తామని తహశీల్దార్ అన్నాజీరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నర్సీపట్నం మండలంలో ఓటర్ వెరిఫికేషన్‌ను అధికారులు, బిఎల్ఓలు కలిపి 88 మంది శరవేగంగా చేస్తున్నారని నర్సీపట్నం ఎమ్మార్వో అన్నాజీరావు తెలియజేశారు. నర్సీపట్నం మండలంలో 71 వేలు పైబడి ఓటర్లు ఉన్నారని ఇంతవరకు 50 శాతం వెరిఫికేషన్ పూర్తి చేశామని తెలిపారు. గడువులోపు మిగిలిన 50 శాతం పూర్తి చేస్తామన్నారు. పారదర్శకంగా ఓటర్ లిస్ట్ తయారు చేస్తున్నామని తెలిపారు.

నేడు టిడిపి సమావేశం

ప్రజాశక్తి-మాడుగుల:మాడుగుల పార్టీ కార్యాలయంలో టిడిపి మండల పార్టీ సమావేశం ఈనెల 14న జరుగుతుందని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి ఉండూరు దేముడు తెలిపారు.పార్టీ ఇన్ ఛార్జ్ పివిజి కుమార్, మాజీ ఎమ్మెల్యే రామా నాయుడు, సీనియర్ నేత పైలా ప్రసాద్‌రావు, పార్టీ పరిశీలకులు లోడగల కృష్ణ పాల్గొంటారని తెలిపారు. పార్టీ నేతలు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.


పనులను ప్రారంభిస్తున్న కౌన్సిలర్ బుల్లిదొర

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్: మున్సిపాలిటీలో 15వ వార్డులో వార్డ్ కౌన్సిలర్ మాగిరెడ్డి బుల్లిదొర ఆదివారం అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా బుల్లిదొర మాట్లాడుతూ, ప్రజల విన్నపం మేరకు ఎమ్మెల్యే ఉమా శంకర్ గణేష్ వార్డ్ అభివృద్ధికి రూ.20లక్షల నిధులు మంజూరు చేశారన్నారు.వార్డు ప్రజల తరుపున ఎంఎల్‌ఏ గణేష్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వార్డు ఇన్ ఛార్జ్ మురళీకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



దీక్ష చేపడుతున్న గిరిజనులు

గిరిజనులపై చిన్నచూపు

ప్రజాశక్తి- కోటవురట్ల:గిరిపుత్రుల పట్ల ప్రభుత్వం చిన్న చూపు తగదని, తక్షణమే వారి సమస్యలు పరిష్కరించాలని జనసేన పార్టీ జిల్లా నాయకులు గడ్డం బుజ్జి డిమాండ్ చేశారు. అణుకు గిరిజనులు 38 రోజులుగా చేపడుతున్న రిలే నిరాహార దీక్షకు ఆదివారం ఆయన శిబిరం వద్దకు చేరుకుని సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 38 రోజులుగా దీక్ష చేపడుతున్నా ప్రభుత్వం గిరిజనులను పట్టించుకోక పోవడం సరికాదన్నారు. గ్రామంలో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలని, లేనిపక్షంలో మండల కేంద్రంలో పెద్ద ఎత్తున పోరాటం చేస్తామన్నారు. స్థానిక ఎమ్మెల్యే గొల్ల బాబురావు కంటితుడుపు చర్యగా హామీలు ఇచ్చి నెరవేర్చలేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు డేవిడ్‌రాజు, జనసేన నాయకులు రాంబాబు, ఏసుబాబు, బండి రాజు, పలువురు గిరిజనులు పాల్గొన్నారు.



ఆటలు ఆడుతున్న విద్యార్థులు

గ్రంథాలయంలో చిల్డ్రన్స్ క్లబ్

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్: స్థానిక ఐదు రోడ్ల జంక్షన్లో శాఖా గ్రంథాలయంలో ఆదివారం చిల్డ్రన్స్ క్లబ్ ఉత్సాహంగా సాగింది. పిల్లలతో కథల పుస్తకాలు చదివించడం, డ్రాయింగ్, పాటల పాడటం వంటి కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారిని దమయంతి మాట్లాడుతూ, ఎండలు బాగా ఎక్కువగా ఉన్నందున పిల్లలు . నీరు బాగా తాగాలని, స్కూల్ లో ఇచ్చిన ఇంటి పని ఎప్పటికప్పుడు పూర్తి చేసుకోవాలని సూచించారు.



నీటిని విడుదల చేస్తున్న నాయకులు

రిజర్వాయర్ నీరు విడుదల

ప్రజాశక్తి-గొలుగొండ:నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌గణేష్ ఆదేశాల మేరకు గొలుగొండ మండలం రావణాపల్లి రిజర్వాయర్ నీటిని ఆదివారం గేట్లు ఎత్తి విడుదల చేశారు. రైతులు నీటిని సద్వినియోగం చేసుకొని, పొదుపుగా వాడుకోవాలని పలువురు నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ అధ్యక్షులు కిలపర్తి పెద్దిరాజు, ఏపిసి చైర్మన్ కొల్లు సత్యనారాయణ, కొమిర సర్పంచ్ అల్లు రాజుబాబు, మాజీ పిఎసిఎస్ అధ్యక్షులు కొల్లు అప్పలనాయుడు, ఏటిగైరంపేట మాజీ ఎంపిటిసి పాము రాజుబాబు, గ్రామ కమిటీ అధ్యక్షులు సుర్ల రమణ, మాజీ వైస్ ప్రెసిడెంట్ కొల్లు రాము, సచివాలయ కన్వీనర్ మడగల పైడియ్య, బూత్ కన్వీనర్ కొల్లు గంగునాయుడు, రిజర్వాయర్ రైతులు పాల్గొన్నారు.

జాడలేని చినుకు



- ముందుకు సాగని వరి సాగు
- ఎండుతున్న వరినారు
- బతికించేందుకు అన్నదాత పాట్లు
- బీటలు బారుతున్న మడులు




ఉపమాకలో ఎండుతున్న వరి ఆకు

ప్రజాశక్తి -నక్కపల్లి:

ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి వర్షాభావ పరిస్థితులు అనుకూలించక పోవడంతో ఆరంభంలోనే అన్నదాతను నష్టాల్లోకి నెట్టేసే పరిస్థితులు కనిపిస్తున్నాయి. వర్షాలు సరిగా పడక పోవడంతో ఎండ తీవ్రతకు వరి నారు, అక్కడక్కడ ఉడిసిన వరి చేలు ఎండిపోతున్నాయి. వర్షాలు ముఖం చాటేయడంతో ఉడుపులు సాగక వరి నారు ముదురు పోతుంది. ఆదిలోనే చినుకు జాడ లేక పోవడంతో రైతులు తీవ్ర నిరాశతో కొట్టు మిట్టాడుతున్నారు.

మండలంలోని ఖరీఫ్ సీజన్ సంబంధించి వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు వరి విత్తనాలను అందచేసారు. ఆర్‌జిఎల్, సాంబ మసూరి, ఇంద్ర, అమర వంటి రకాల వరి విత్తనాలను 775 క్వింటాలు రైతులకు సరఫరా చేశారు. జూన్, జూలై నెలల్లో అడపా దడపా కురిసిన వర్షాలకు రైతులు ఖరీఫ్ సీజన్‌కు సన్నద్ధమై నారు మడులను సిద్ధం చేసి వరి నారు కోసం వరి విత్తనాలను జల్లారు. ఇప్పటి వరకు వర్షాలు సక్రమంగా లేక పోవడంతో ఆకు ఎదుగుదల అంతంత మాత్రంగానే ఉంది. చాలా చోట్ల ఆకు ముదిరి పోయింది. ఎండ తీవ్రతకు వరి ఆకు ఎండి పోతుండటంతో, వరి ఆకును రక్షించుకునేందుకు రైతులు పడరాని పాట్లు పడుతున్నారు. కొన్ని గ్రామాల్లో పొలాల్లో బావులు ఉన్న రైతులు మోటార్ల సహాయంతో నారుమడులకు నీరు పెట్టి ఆకును రక్షించుకునే పనిలో నిమగ్నమై ఉన్నారు. ఉద్దండపురంలో కాలువుల్లో ఉన్న కొద్దిపాటి నీటిని మోటర్ పెట్టి వరి నారును తడుపుతున్నారు. ఒకపక్క తడుపుతుంటే మరోపక్క ఎండకి వరి ఆకు ఎండిపోతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మండలంలో వరి సాధారణ సాగు 5125 ఎకరాలు కాగా, ఇప్పటికి 350 ఎకరాల్లో మాత్రమే రైతులు ఉడుపులు వేశారు.వరుణుడు ముఖం చాటేయడంతో ఉడుపులు స్పీడు అందుకోలేదు. అడపా దడపా కురిసిన వర్షాలకు మండలంలో ముకుందరాజుపేట, డొంకాడ, దోసలపాడు, ఉద్దండపురం, రమణయ్యపేట, గుల్లిపాడు గ్రామాల్లో మాత్రమే కొంతమేర ఉడుపులు ప్రారంభించారు. అయితే వర్షాలు కురవక పోవడంతో ఉడిసిన మడులు బీటలువారి వరి నాట్లు ఎండి పోతున్నాయి. దీన్ని రక్షించుకునేందుకు రైతులు పడరాని పాట్లు పడుతున్నారు. 40 శాతం వర్షపాతం లోటు ఉంది. వర్షాలు సక్రమంగా లేనందున చెరువులు, బావులు, కాలవుల్లో నీటి చుక్క లేక పోవడంతో రైతులు దమ్ములు చేయలేక పోతున్నారు. ఆరంభంలోనే ఇలా ఉంటే వరి సాగు సాగుతుందా లేదా అన్న మీమాంసంలో రైతులు ఆందోళన చెందుతున్నారు.



ఉపమాకలో ఖాళీగా ఉన్న మడి

గత ఏడాది వర్షాలు సమృద్ధిగా కురవడంతో వరి సాగు ఆశాజనకంగా సాగింది. ఇప్పుడు ఆ పరిస్థితి ఎక్కడా కనిపించలేదు. వర్షాలు సక్రమంగా కురిసి ఉంటే ఈ పాటికే మండలంలోని అన్ని గ్రామాల్లోనూ ఉడుపులు పూర్తయి వరి చేనుతో పొలాలు పచ్చగా కళకళలాడుతూ కనిపించేవి. కానీ, ఇప్పుడు ఆ పరిస్థితి ఎక్కడా కనిపించ లేదు. పొలాలన్నీ ఖాళీగా దర్శన మిస్తున్నాయి.



ఉద్దండపురంలో మోటార్‌తో తడుపుతున్న వరి నారు

నారు ఎండిపోతుంది

చినుకు జాడ లేకపోవడంతో ఎండ తీవ్రతకు వరి నారు ఎండిపోతుంది. వర్షాలు సక్రమంగా లేకపోవడంతో ఎక్కడా చుక్క నీరు కనిపించలేదు. బావిలో ఉన్న కొద్ది నీటిని మోటార్ సహాయంతో వరి ఆకును బ్రతికించుకునే ప్రయత్నం చేస్తున్నాం. ఒకపక్క తడుపుతుంటే మరోపక్క ఎండిపోతుంది. ఆకు కూడా ముదిరిపోయే పరిస్థితి నెలకొంది. వర్షాలు ముఖం చాటేయడంతో దమ్ములు చేసే పరిస్థితి ఎక్కడా కనిపించలేదు. వర్షాభావ పరిస్థితులను చూస్తే ఈ ఏడాది వరి సాగు సాగేటట్లు లేదు.



గొర్ల అప్పారావు,
రైతు ,మనబాలవాని పాలెం

అక్రమంగా మట్టి తవ్వకాలు

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్: మున్సిపాలిటీలో బలిఘట్టం దేవుని మాన్యం భూమి సర్వే నంబరులో 647, 648లో 30 ఎకరాల భూమిని శెట్టి సాంబయ్య నాయుడు సంవత్సరన్నర క్రితం ఆక్షన్ ద్వారా లీజుకు తీసుకున్నారు. ఆ భూమిలో కొన్ని రోజులుగా చదును పేరుతో మట్టి తవ్వకాలు చేపడుతున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. సంవత్సన్నర కిందట వేలంపాటలో లీజుదారుడు దక్కించుకున్న భూమిలో జేసీబీతో అక్రమ తవ్వకాలు చేపట్టి ట్రాక్టర్లతో మట్టిని తరలిస్తున్నారు. ఈ తతంగమంతా దేవదాయ శాఖ అధికారుల కనుసన్నల్లోనే జరుగుతుందని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

వ్యవసాయ పంటలకు గాను మూడు సంవత్సరాల లీజుకు తీసుకొని 15 ఎకరాల భూమిలో పంటలు పండిస్తూ మరో 15 ఎకరాల భూమిలో గల మట్టి తవ్వకాలు జరిపి అమ్ముకుంటున్నారని స్థానికులు తెలిపారు. దేవుని మాన్యం భూమిలో ప్రభుత్వ నిబంధనల ప్రకారం చదును చేసుకోవడానికి తప్ప ఇందులో ఎటువంటి మట్టిని తరలించేందుకు అనుమతులు లేవు. మట్టి తరలించాలంటే తగినటువంటి అనుమతులు ఉండాలి. కానీ అందుకు విరుద్ధంగా ఇక్కడ జెసిబితో మట్టి తవ్వకాలు జరిపి ట్రాక్టర్లతో తోలకాలు చేస్తున్నారు. ఇందులో ఎటువంటి వాణిజ్య పంటలు పండించకూడదు అనే నిబంధనలు ఉన్నాయి కేవలం ఆహార పంటలు మాత్రమే పండించాలి. భూమిలో మట్టిని తరలించకూడదు అనే నిబంధనలు ఉన్నప్పటికీ అందుకు విరుద్ధంగా మట్టి ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. కొంత ఆహార పంటలు పండిస్తూ మిగతా భూముల్లో మట్టిని తరలించడం పట్ల అనేక విమర్శలు వెల్లువెత్తుతున్నాయి దీనిపై దేవాదాయశాఖ అధికారి మురళిని ఫోన్లో సంప్రదించగా గతంలో మూడు సంవత్సరాలు ఈ భూమి ఖాళీగా ఉందని అటువంటిది గత సంవత్సరం శెట్టి సాంబయ్య నాయుడు లీజ్ తీసుకున్నారని తెలిపారు. ఆ భూమిని శుభ్రం చేసుకుని వ్యవసాయానికి అనుకూలంగా చేసుకునే విధంగా అవకాశం ఇచ్చామని అందులో ఎటువంటి అక్రమ తవ్వకాలు జరిగినప్పుడు పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని అన్నారు.



జెసిబితో చేపడుతున్న తవ్వకాలు



దేవుని మాన్యం భూమి ఇదే..